
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528


కృష్ణ  బుధవారం 8 జూలై 2026  సంపుటి : 01  సంచిక :175  పేజీలు : 12  వెల : 3/-  PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం సూర్యోదయం: 5:31 । సూర్యాస్తమయం: 6:33 చంద్రోదయం: 11:42 । చంద్రాస్తమయం: 11:30 తిథి: బహుళ సప్తమి ఉ. 8:43 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12:44 వరకు, తదుపరి రేవతి, యోగం: శోభ ఉ. 11:49 వరకు, తదుపరి అతిగండ, కరణం: బవ ఉ. 8:43 వరకు, తదుపరి బాలవ రా. 8:05 వరకు, తదుపరి కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





### కొత్తగా ల్యాండ్‌పూలింగ్ జరిగే

## గ్రామాల రైతులకు

# రుణమాఫీ

- కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతుల కుటుంబాలకు రుణమాఫీకి నిర్ణయం
- 2024 జూన్ నుంచి భూములిచ్చే వారికి కౌలు రూ.40 వేలు ఇచ్చేందుకు ఆమోదం
- సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం

**అమరావతి**

సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజధాని అమరావతి కోసం 2024 జూన్ 12 నుంచి ల్యాండ్ పూలింగ్‌కి భూములిచ్చే రైతులకు కౌలు రూ.40 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భూములిచ్చినప్పటి నుంచి 10 ఏళ్ల పాటు ఇది అమలో ఉంటుంది. ప్రతి ఏటా జరీబు భూమికి ఎకరాకు రూ.5000, మెట్ట భూమికి ఎకరాకు రూ.3000 పెంచేందుకు - మిగతా3లో

## మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..

- భారత ప్రధాని ఈవెంట్‌కు రికార్డు స్థాయి ఏర్పాట్లు
- ఈ వారం ఆస్ట్రేలియాలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- మెల్‌బోర్న్‌లో జరగనున్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు
- ఈవెంట్‌కు 30,000 మంది వస్తారని అంచనా వేస్తున్న అధికారులు
- భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు విలువలపై ఆధారపడ్డవని చెప్పిన హైకమిషనర్
- క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారంపై దృష్టి సారించిన ఇరు దేశాలు





### ఒక్క కారు పాడైందని

## నిరూపించండి

- ఈ20 పెట్రోల్‌పై గడ్కరీ సవాల్
- ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం జరగలేదన్న గడ్కరీ
- విమర్శలను పెయిడ్ ప్రచారంగా అభివర్ణించిన కేంద్ర మంత్రి
- మైలేజీ తగ్గడంపై సోషల్ మీడియాలో వినియోగదారుల ఆందోళన

# సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామి



- మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- రూ.9076 కోట్ల పెట్టుబడులు, 10 వేల ఉద్యోగాలు
- సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం
- పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖల ప్రాజెక్టులపై చర్చ
- రూ.9,076 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 11 ప్రాజెక్టులపై చర్చ

**అమరావతి**

వ్యవసాయ రంగాన్ని పారిశ్రామికీకరణతో అనుసంధానిస్తూ, ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సరికొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. సీఎం అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 19వ ఎస్ఐపీబీ సమావేశంలోన్ 11 భారీ ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపటంతో పాటు, రూ.9076 కోట్ల రూపాయల పెట్టుబడుల ఆమోదంతో, పారిశ్రామిక ప్రగతికి సరికొత్త బాటలు వేశారు. వీటి ద్వారా 10531 ఉద్యోగ అవకాశాలు తలుపు తట్టనున్నాయి. భవిష్యత్తులో ఇథనాల్‌కు పెరగనున్న డిమాండ్‌ను సద్వినియోగం - మిగతా3లో

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు..





- భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్
- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ.1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- ఆస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి



### దేశంలో స్కూల్ డ్రాప్‌అవుట్లు తగ్గుముఖం

- విద్యారంగంలో కీలక పురోగతి- కేంద్రం నివేదిక
- 2025-26లో ప్రాథమిక నుంచి సెకండరీ వరకు డ్రాప్‌అవుట్ రేటు గణనీయంగా తగ్గినట్లు కేంద్ర విద్యాశాఖ నివేదిక
- దాటిన దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02కోట్ల మార్కు
- పాఠశాల విద్య పనితీరు సూచీలో చండీగఢ్ అగ్రస్థానం



### ముఖ్యమంత్రి పర్యటనలను

### సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి

# ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు





- ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి
- విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవంలో పాల్గొన్న పవన్
- కళాకారుల అద్భుత ప్రతిభ వారి కష్టాన్ని గుర్తించడానికి వచ్చా
- అద్భుత కళల వెనుక లక్షలమంది కళాకారుల కృషి ఉంది.

**అమరావతి**

జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. వ్యర్థమని భావించే గుర్రపుడెక్క ఆకుతో కూడా కళాకృతులు రూపొందించారని గుర్తుచేశారు. హస్తకళాకారుల హెల్త్ ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా - మిగతా3లో



## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

- విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని హోం మంత్రి ఆదేశాలు
- వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదు

**అమరావతి**

నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్?నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో - మిగతా3లో

# దేశంలో స్కూల్ డ్రాప్అవుట్లు తగ్గుముఖం



దేశంలోని పాఠశాల విద్యా వ్యవస్థలో 2025-26 విద్యా సంవత్సరంలో కీలకమైన పురోగతి నమోదైంది. ముఖ్యంగా విద్యార్థుల స్కూల్ డ్రాప్అవుట్ రేటు గణనీయంగా తగ్గగా, సెకండరీ స్థాయిలో చేరికలు, కొనసాగింపు రేట్లు మెరుగుపడ్డాయి. అలాగే దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్ల మార్కును దాటింది. ఈ వివరాలను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన యూడైస్ ప్లస్ (ఖఱ×ూజుం) 2025-26 నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం గత మూడు విద్యా సంవత్సరాలతో పోలిస్తే 2025-26లో విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి గణనీయంగా తగ్గింది.

### డ్రాప్అవుట్ రేటులో స్పష్టమైన తగ్గుదల

ప్రిపరేటరీ స్థాయిలో 2024-25లో 2.3 శాతంగా ఉన్న డ్రాప్అవుట్ రేటు 2025-26లో 1.8 శాతానికి తగ్గింది. సెకండరీ స్థాయిలో ఇది 8.2 శాతం నుంచి 7 శాతానికి పడిపోయింది. అన్ని స్థాయిల్లోనూ ఈ తగ్గుదల కనిపించడం విద్యార్థులను చదువులో కొనసాగించే ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయని విద్యాశాఖ పేర్కొంది.

### కొనసాగింపు రేటు మెరుగుదల

మిడిల్ స్థాయిలో విద్యార్థుల రిటెన్షన్ రేటు 82.8 శాతం నుంచి 83.7 శాతానికి పెరిగింది. సెకండరీ స్థాయిలో ఇది 47.2 శాతం నుంచి 51.9 శాతానికి చేరింది. అయితే ఫౌండేషన్, ప్రిపరేటరీ స్థాయిల్లో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. అయినప్పటికీ గత మూడేళ్లలో నమోదైన పురోగతి కొనసాగుతోందని నివేదిక పేర్కొంది.

### సెకండరీ పాఠశాలల పెరుగుదలతో ప్రయోజనం

దేశవ్యాప్తంగా సెకండరీ విద్య అందించే పాఠశాలల సంఖ్య పెరగడం వల్ల విద్యార్థులకు చదువు అందుబాటులోకి రావడంతో పాటు మధ్యలోనే చదువు మానేయకుండా కొనసాగించే అవకాశం పెరిగిందని విద్యాశాఖ తెలిపింది. ఇదే రిటెన్షన్ రేటు మెరుగుపడటానికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెకండరీ స్థాయిలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (+జు=) కూడా గణనీయంగా పెరిగింది. 2024-25లో 68.5 శాతంగా ఉన్న ఈ నిష్పత్తి 2025-26లో 71.7 శాతానికి చేరింది. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత తరగతుల్లో చేరుతున్నట్లు స్పష్టమవుతోంది.

### 1.02 కోట్లకు చేరిన ఉపాధ్యాయుల సంఖ్య

విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్లను దాటింది. 2022-23తో పోలిస్తే 2025-26లో ఉపాధ్యాయుల సంఖ్య 8.3 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఉపాధ్యాయుల పెరుగుదలతో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మెరుగుపడటంతో పాటు ప్రాంతాల మధ్య ఉన్న కొరతను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.

### పాఠశాల విద్య పనితీరు సూచీలో చండీగఢ్ అగ్రస్థానం

ఇక కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2025-26 ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరులో చండీగఢ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. చండీగఢ్ ఒక్కటే 'ఉత్తమ్-3' గ్రేడ్ సాధించింది. పంజాబ్, కేరళ, ఢిల్లీతో పాటు దాద్రా నగర్ హవేలీ-దమన్ అండ్ డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతం తదుపరి స్థాయిలో నిలిచాయి. అయితే ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం కూడా అత్యున్నత 'ఉత్కర్ష్', 'ఉత్తమ్-1', 'ఉత్తమ్-2' గ్రేడ్లను అందుకోలేకపోయింది.

### జిల్లాల పనితీరులోనూ పురోగతి

జిల్లాల వారీగా పరిశీలించినప్పటికీ అత్యున్నత 'ఉత్కర్ష్' గ్రేడ్ ఏ జిల్లాకూ దక్కలేదు. అయితే ఒక జిల్లా 'ఉత్తమ్-1', 19 జిల్లాలు 'ఉత్తమ్-2' గ్రేడ్ సాధించాయి. గత ఏడాదితో పోలిస్తే మంచి గ్రేడ్ సాధించిన జిల్లాల సంఖ్య పెరిగినట్లు నివేదిక తెలిపింది. మొత్తం 462 జిల్లాలు తమ పనితీరును మెరుగుపరుచుకోగా, వాటిలో 50 జిల్లాలు ఒక గ్రేడ్ నుంచి మరో మెరుగైన గ్రేడ్కు చేరుకున్నాయి. ఉత్తమ్-2 గ్రేడ్ సాధించిన జిల్లాల్లో ఢిల్లీ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి ఏడు, కేరళ నుంచి మూడు, మహారాష్ట్ర నుంచి రెండు జిల్లాలు ఉన్నాయి. చండీగఢ్, డయ్యూ, హిమాచల్ ప్రదేశ్లోని హమీర్పూర్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

### 70 సూచికల ఆధారంగా అంచనా

పెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్లో విద్యా ఫలితాలు, పాఠశాలలకు చేరువ, మౌలిక వసతులు, సమాన అవకాశాలు, పరిపాలన, ఉపాధ్యాయుల శిక్షణ వంటి ఆరు ప్రధాన విభాగాల్లోని 70 సూచికల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేశారు. జిల్లాల స్థాయిలో కూడా ఇదే తరహా ప్రమాణాలతో మూల్యాంకనం చేపట్టారు. ఏదేమైనా 2025-26 విద్యా సంవత్సరంలో డ్రాప్అవుట్ రేటు తగ్గడం, సెకండరీ స్థాయిలో చేరికలు పెరగడం, ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం వంటి అంశాలు దేశ విద్యా రంగంలో సానుకూల మార్పులకు సంకేతాలుగా కేంద్ర విద్యాశాఖ నివేదిక పేర్కొంది.

# ముఖ్యమంత్రి పర్యటనలను మేము నియంత్రించాలా?



కరూర్ తొక్కిసలాటపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని డీఎంకే వేసిన పిటిషన్?పై మంగళవారం సుప్రీంకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. 'సీఎం పర్యటనలను మేము నియంత్రించాలా?' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశపౌరులందరికీ భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, దానిపై ఆంక్షలు విధించాలా? అంటూ ప్రశ్నించింది. సీఎం విజయ్? జులై 10న కరూర్ పర్యటనకు వెళ్లనున్నారు. తొక్కిసలాట సమయంలో మరణించిన వారి కుటుంబాలతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలోనే, సీఎం విజయ్?, మంత్రి అధవ్? అర్జున సహా ఇతర నిందితులు బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని, బాధిత కుటుంబాలతో వారు జరిపే చర్చలను కూడా నియంత్రించాలని కోరుతూ డీఎంకే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్ను విచారించేందుకు జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ అలోక్ల ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. దీనితో పిటిషనర్ తరపు న్యాయవాది దీనిని ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. అయితే చట్టప్రకారం అందుబాటులో ఉన్న ఇతర మార్గాలను ఆశ్రయించే స్వేచ్ఛను పిటిషనర్?కు కల్పించింది. గతేడాది కరూర్? తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో జులై 10న సీఎం విజయ్ కరూర్ తొక్కిసలాట మరణించిన వారి కుటుంబాలకు పరిహారం (ఎక్స్గ్రేషియా), కారుణ్య నియామక పత్రాలను పంపిణీ చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలోనే డీఎంకే ఈ అత్యవసర పిటిషన్?ను దాఖలు చేయడం గమనార్హం.

### కోర్టులో జరిగిన వాదోపవాదాలు

డీఎంకే తరఫున సీనియర్ అడ్వకేట్ రంజిత్ కుమార్ తన వాదనలు వినిపించారు. తమిళనాడు మంత్రులు బహిరంగ ప్రకటనలు చేస్తూ, కరూర్ తొక్కిసలాట కేసుపై ఒక ప్రత్యేకమైన కథనాన్ని సృష్టిస్తున్నారు. ఇది ఈ కేసును సీబీఐకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ వాదనపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ, "ముఖ్యమంత్రి పర్యటనలను సుప్రీంకోర్టు నియంత్రించాలని, ఆయన రూట్ మ్యాప్ను న్యాయస్థానం ఖరారు చేయాలని మీరు కోరుకుంటున్నారా" అని ప్రశ్నించారు. దీనికి రంజిత్ కుమార్ వివరణ ఇస్తూ, తాము బాధితులకు పరిహారం అందించడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే సీఎం, ఇతర మంత్రులు కేసు మెరిట్స్పై వ్యాఖ్యలు చేయకుండా నిలువరించాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు.

దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ, "అంటే వాక్ స్వాతంత్ర్యంపై మేము స్టే ఇవ్వాలని మీరు కోరుతున్నారా? వారి మాటలకు మీ మాటలతోనే సమాధానం ఇవ్వండి. సీబీఐ విచారణకు ఆదేశించిన కేసులో, ఒక రాజకీయ ప్రత్యర్థిని చేర్చి, ఒకదాని తర్వాత ఒకటిగా ఆదేశాలు జారీ చేయడానికి సుప్రీంకోర్టు ఎలా అనుమతిస్తుంది?"? అని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్?గ్రేషియా, కారుణ్య నియామక ఉత్తర్వులు అందించడం వల్ల విచారణ ఎలా ప్రభావితం అవుతుంది? అని న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "మీరు బాగా ఆలోచించే ఈ పిటిషన్?ను వేశారా?" అని సీనియర్? అడ్వకేట్? రంజిత్ కుమార్?ను జస్టిస్? విశ్వనాథన్ ప్రశ్నించారు.

దీనికి రంజిత్ కుమార్ సమాధానమిస్తూ, విజయ్? ఈ కేసులో డ్యూయెల్ రోల్ పోషిస్తున్నారని అన్నారు. ఒక వైపు ఈ కేసులో నంబర్?-1 నిందితుడిగా ఉన్న విజయ్?, మరోవైపు ముఖ్యమంత్రిగా ఉండి బాధితులకు పరిహారం అందించడానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే జస్టిస్ విశ్వనాథన్ ఆ వాదనలను అడ్డుకున్నారు. ఎఫ్ఐఆర్లోని నిందితుల పేర్లలో విజయ్ పేరు లేదని స్పష్టం చేశారు. "ఎవరు నంబర్ వన్ నిందితుడు మీ పిటిషన్లో కానీ, గత ప్రభుత్వం నమోదు చేసిన ఎఫ్ఐఆర్లో గానీ విజయ్?ను నిందితుడిగా పేర్కొనలేదు. దయచేసి మీరు చెబుతున్న వివరాలను సరిచూసుకోండి" అని సూచించారు.

మరోవైపు రెస్పాండెంట్స్ (విజయ్ తరఫు న్యాయవాది) తరఫు సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట కేసులో సీఎం విజయ్ నిందితుడు కాదని పేర్కొన్నారు. ఇది విన్న జస్టిస్ విశ్వనాథన్ డీఎంకే తరఫు న్యాయవాదితో మాట్లాడుతూ, "ఈ కేసులో నిందితులుగా ఉన్న కొందరు మంత్రులు మాత్రమే, ముఖ్యమంత్రి కాదు. మీరు కోర్టును రాజకీయ పోరాట వేదికగా ఎందుకు మారుస్తున్నారు? ఈ పిటిషన్?ను విచారణ చేయడానికి మేము సిద్ధంగా లేము. అందుకే పిటిషన్ను ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నాం" అని అన్నారు.

దీనితో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జస్టిస్ (రిటైర్డ్) అజయ్ రస్తోగి నేతృత్వంలోని కమిటీ ముందు ఈ విషయాన్ని లేవనెత్తే అవకాశం ఇవ్వాలని రంజిత్ కుమార్ కోరారు. అలాగే కేసుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జునపై కోర్టు ధిక్కారణ పిటిషన్? దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ వాదనలు అన్నీ విన్న ధర్మాసన డీఎంకే పిటిషన్?ను కొట్టివేసింది.

## చాట్జీపీటీలో అంతరాయం..
## ఆగిపోయిన ఇమేజ్ జనరేషన్ సేవలు

ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేదిక చాట్జీపీటీలో ఇమేజ్ జనరేషన్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. మంగళవారం వినియోగదారులు ప్రాంప్ట్లు నమోదు చేసినప్పటికీ, ఇమేజ్లు జనరేట్ కాకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యను గుర్తించామని, దీనిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని మాతృసంస్థ ఓపెన్ఏఐ వెల్లడించింది. ఉదయం నుంచి చాట్జీపీటీ ఇమేజ్ జనరేషన్ విభాగంలో అధిక సంఖ్యలో సాంకేతిక లోపాలు తలెత్తినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఇంజినీర్లు సమస్యను చక్కదిద్దే ప్రక్రియను ప్రారంభించారు. ఈ అంతరాయం డాల్-ఈ ఆధారిత ఇమేజ్ క్రియేషన్ టూల్స్పై ప్రభావం చూపిందని, పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని పేర్కొంది. కస్టమ్స్ జీపీటీ, చాట్జీపీటీ, ఫెడ్ రాంప్ కోడెక్స్, ఇమేజ్ జనరేషన్, వర్క్ స్పేస్ అనలటిక్స్, కన్వర్సేషన్ సెర్చ్ వంటి సేవల్లో కూడా సమస్య వచ్చిందని కంపెనీ తెలిపింది. యూజర్ల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిపింది. దీనిపై తమ బృందం పని చేస్తోందని పేర్కొంది. ఇప్పటికే చాట్ జీపీటీ సేవలను పునరుద్ధరించామని తెలిపింది. మిగిలిన సేవలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కంపెనీ వెల్లడించింది. ఈ సాంకేతిక సమస్యపై డౌన్డెటెక్టర్ వంటి ప్లాట్ఫామ్లలో వినియోగదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క భారతదేశంలోనే వందకు పైగా ఫిర్యాదులు నమోదైనట్లు సమాచారం. ఉచిత మరియు ప్రీమియం పెయిడ్ యూజర్లు అందరూ ఈ సమస్యను ఎదుర్కొన్నారు.

## ఒక్క కారు పాడైందని నిరూపించండి



దేశంలో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ20) వినియోగం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఈ20 పెట్రోల్ కారణంగా కనీసం ఒక్క కారు పాడైందని నిరూపించాలని ఆయన విమర్శకులకు సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాన్ని ఆయన "పెయిడ్ క్యాంపెయిన్"గా అభివర్ణించారు. ఇంధన దిగుమతుల కోసం దేశం ఏటా రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, ఇథనాల్ ఉత్పత్తి ద్వారా రైతులకు రూ. 45,000 కోట్ల అదనపు ఆదాయం లభిస్తోందని ఆయన వివరించారు. ఇంధన దిగుమతులను తగ్గించుకుంటూ, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వాడకాన్ని వేగవంతం చేస్తోంది. నిర్దేశించుకున్న గడువు కంటే ముందే, 2026 ఏప్రిల్ నాటికి జు20 లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చెరకు పిప్పి, నూకలు, మొక్కజొన్నల నుంచి ఇథనాల్ను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, ఈ మిశ్రమ పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గుతోందని, పాత వాహనాల ఇంజిన్లపై ఇది దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని సోషల్ మీడియా వేదికగా కొందరు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు ముక్తకంఠంతో తోసిపుచ్చుతున్నాయి. ఇథనాల్ కలపడం వల్ల మైలేజీలో 2 నుంచి 5 శాతం వరకు స్వల్ప తగ్గుదల ఉండవచ్చని, అంతకు మించి ఇంజిన్కు ఎలాంటి ప్రమాదం ఉండదని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి గతంలోనే స్పష్టం చేశారు. మారుతి సుజుకి, టయోటా, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ సంస్థలు సైతం జు20 వినియోగానికి మద్దతు తెలిపాయి. లక్షలాది పాత వాహనాలకు సర్వీసింగ్ నిర్వహించినా, ఇథనాల్ వల్ల తలెత్తిన సమస్యలు ఏవీ గుర్తించలేదని మారుతి సుజుకి వెల్లడించింది. కల్తీ ఇంధనం వల్ల పాడైన కారును చూపిస్తూ, అది జు20 ప్రభావమేనని ప్రచారం చేస్తున్న ఒక వైరల్ వీడియోను టయోటా సంస్థ ఇప్పటికే ఖండించింది.

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు




రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ.1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. భారత్కు చెందిన డీఆర్డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## మెల్బోర్న్లో మోదీ మేనియా..



ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారాంతంలో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జూలై 9న జరిగే 'మెల్బోర్న్ మీట్స్ మోదీ' ప్రవాస భారతీయ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో జనం హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పర్యటనపై ఆస్ట్రేలియాలోని భారత సమాజంలో విపరీతమైన ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషనర్ నగేష్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడించారు. "ప్రధాని మోదీకి ఇక్కడ విపరీతమైన ఆదరణ ఉంది. మార్వెల్ ఎరీనాలో జరిగే ఈవెంట్కు 25,000 నుంచి 30,000 మంది హాజరవుతారని భావిస్తున్నాం. కానీ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియాలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. పరిమిత స్థలం కారణంగా చాలా మందికి అవకాశం కల్పించలేకపోయాం" అని ఆయన వివరించారు. కొన్నేళ్ల క్రితం సిడ్నీలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో నాటి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, మోదీని 'ది బాస్' అని సంబోధించిన విషయాన్ని నగేష్ సింగ్ గుర్తుచేశారు. ఈసారి మెల్బోర్న్ ఈవెంట్ అంతకుమించి విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని కూడా ప్రసంగిస్తారని తెలిపారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆధారపడ్డవని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని సింగ్ అన్నారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు వార్షిక సదస్సులో పాల్గొంటారు. అదేవిధంగా, క్రికెట్ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు భావిస్తున్నట్లు తెలిపారు. క్రీడా విజ్ఞానం, సాంకేతికత, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, దానిని 'క్వాడ్' కూటమితో పోల్చడం సరికాదని నగేష్ సింగ్ స్పష్టం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గణనీయంగా పెరుగుతోందని, క్వాడ్ అనేది నాలుగు దేశాలతో కూడిన ప్రత్యేక ఏర్పాటు అని ఆయన వివరించారు.

# సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామి



-మొదటిపేజీ తరువాయి

చేసుకునేలా సరికొత్త ఇథనాల్ బ్లెండింగ్ పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలని, ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అని స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు.

**19వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు:**

డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థ నెల్లూరు జిల్లాలో 4 స్టార్ హోటల్ – రూ.139.92 కోట్ల పెట్టుబడి, 180 మందికి ఉపాధి.

మాధవి లీజర్ అండ్ స్టేస్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో 3 స్టార్ హోటల్ – రూ.52.10 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉపాధి.

శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వైఎస్సార్ కడప జిల్లాలో సమగ్ర అమ్యూజ్‌మెంట్ పార్క్ – రూ.68.69 కోట్ల పెట్టుబడి, 690 మందికి ఉపాధి.

వజ్ర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ విజయవాడలో హోటల్, బ్యాంక్వెట్, ఎగ్జిబిషన్ సెంటర్ – రూ.62.40 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉపాధి.

నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ (బీ×ుూ) తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్నఎట్టిపాకంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ – రూ.255 కోట్ల పెట్టుబడి, 400 మందికి పైగా ఉపాధి.

అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనకాపల్లి జిల్లా పరవాడలో సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ – రూ.1,600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉపాధి.

బెర్రీ అలాయ్స్ లిమిటెడ్ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ మాంగనీస్ సిన్టర్, డీఆర్ఐ, కార్బన్ పేస్ట్ ప్లాంట్ – రూ.1,200 కోట్ల పెట్టుబడి, 831 మందికి ఉపాధి.

జియో మైసూర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ – రూ.689 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉపాధి.

ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ అసెట్ ×ం ప్రైవేట్ లిమిటెడ్ (గూగుల్ వేర్ హౌస్ పార్టనర్స్) విశాఖపట్నంలో లాజిస్టిక్స్, లైట్ ఇండస్ట్రియల్ పార్క్ – రూ.1,008 కోట్ల పెట్టుబడి, 5,000 మందికి ఉపాధి.

అదానీ ఫౌండేషన్ విశాఖపట్నం జిల్లా కపులుప్పాడలో ప్రాజెక్టు – రూ.2,200 కోట్ల పెట్టుబడి.

మోండెలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లా శ్రీ సిటీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ – రూ.1,801 కోట్ల పెట్టుబడి, 80 మందికి ఉపాధి.

టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు : పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయన్న సీఎం, తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోందన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలిలన్నారు. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలన్న ముఖ్యమంత్రి, సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలని ఆదేశించారు. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలిలన్నారు. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా, దీనికి కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

రెన్యువబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో 'అక్షత్ గ్రీన్‌టెక్' సంస్థ 1,600 కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్‌ను నెలకొల్పుతోంది. కపులుప్పాడలో 'అదానీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 2,200 కోట్ల రూపాయల మెగా ప్రాజెక్టుకు ూ×ుూదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో పాటు గూగుల్ వేర్‌హౌస్ పార్టనర్స్ అయిన 'ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్' సంస్థ విశాఖలో 1,008 కోట్ల రూపాయలతో లాజిస్టిక్స్, లైట్ ఇండస్ట్రియల్ పార్క్‌ను నిర్మించనుంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఐదు వేల మందికి ఉపాధి దక్కనుంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో 'జియో మైసూర్ ఇండియా' సంస్థ 689 కోట్ల రూపాయలతో 'స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్' ప్రాజెక్టును చేపట్టబోతోంది. కడప జిల్లాలో మాధవి లీజర్ సంస్థ 3 స్టార్ హోటల్, శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్ సంస్థ సమగ్ర అమ్యూజ్‌మెంట్ పార్కులను నిర్మించనుండటంతో ఇక్కడ స్థానిక యువతకు భారీగా ఉపాధి లభిస్తుంది. రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ.11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా. 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అంచనా.

# 2029 నయా పాలసీతో టీడీపీ



**గుంటూరు :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అనేక మంది నాయకులకు రాజకీయంగా ఎదిగే అవకాశాలను కల్పించింది. ఈ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రమే కాకుండా లోక్‌సభ స్పీకర్ కేంద్ర మంత్రులు గవర్నర్లు ముఖ్యమంత్రులువంటి కీలక పదవులను కూడా పలువురు నాయకులు అధిరోహించారు. అందుకే ప్రాంతీయ పార్టీల్లో టీడీపీకి ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. 2024 ఎన్నికల్లో పార్టీ పెద్ద ఎత్తున యువ నాయకులకు, కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడిన నాయకులు కూడా ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో చాలామంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ నియోజకవర్గాల్లో చురుకుగా పనిచేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే మరికొందరు మాత్రం ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రజలకు దూరమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరును సమగ్రంగా సమీక్షిస్తున్నట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల సమస్యలపై స్పందన, పార్టీ కార్యకర్తలతో సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై ప్రత్యేకంగా నివేదికలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. టెలికాన్ఫరెన్స్‌లు, సమీక్షా సమావేశాలు, ప్రత్యక్ష చర్చల ద్వారా ఎమ్మెల్యేలకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు కూడా అందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అన్ని సూచనలు ఇచ్చినా కొందరు ఎమ్మెల్యేల పనితీరులో ఆశించిన మార్పు కనిపించడం లేదని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ వర్గాల నుంచి వచ్చిన నివేదికలు, క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ అంతర్గత పరిశీలన ఆధారంగా కొంతమంది ప్రజాప్రతినిధులపై అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా ఇకపై క్రమశిక్షణ చర్యలపై కూడా దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా వివిధ వర్గాలకు భారీ మొత్తంలో పెన్షన్లు అందిస్తున్న నేపథ్యంలో, వాటి పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం కోరుతున్నట్లు సమాచారం. కానీ కొందరు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా తొలిసారి గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు తగ్గడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు వివరించకపోవడం వంటి అంశాలను పార్టీ సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి , కోస్తా ఆంధ్ర , రాయలసీమ ( ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే నాయకులకే భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందనే సంకేతాలను పార్టీ అధిష్ఠానం ఇస్తోందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**రెండు ఎమ్మెల్సీలు ఎవరికి**

ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలవ్వబోతోంది. ఈ నెలలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయి. ఈ నెల 28తో శాసనమండలికి గవర్నర్ కోటాలో ఎన్నికైన శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు పదవీకాలం పూర్తవుతోంది. ఈ రెండు పదవుల భర్తీపై టీడీపీ అధిష్టానం ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పదవులు ఎవరెవరికి ఇవ్వాలనే అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ పదవుల రేసులో టీడీపీ నుంచి పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ పదవుల్లో ఒకదానికి టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరో పదవి రాయలసీమకు కేటాయిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల ఈ ఇద్దరు నేతలు రాజ్యసభ ఎంపీ పదవులు ఆశించారు.. కానీ కొన్ని సామాజిక సమీకరణాలు, రాజకీయపరమైన అంశాలతో అవకాశం దక్కలేదు. అందుకే వీరిద్దరికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరితో పాటుగా మరికొన్ని పేర్లు వినిపిస్తున్నా.. అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందనే ఆసక్తికరంగా మారింది. టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య రెండుసార్లు రాజ్యసభకు వెళ్లాలని ఆశపడ్డారు. పార్టీ అధిష్టానం కూడా ఆయన పేరును పరిశీలించింది.. కానీ చివరి నిమిషంలో ఆయనకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు ఆయన్ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండో స్థానానికి రాయలసీమకు చెందిన మరో నేత పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆయన కూడా రాజ్యసభ ఎంపీ పదవి కోసం ప్రయత్నాలు చేశారు.. కానీ అవకాశం దక్కలేదు. అందుకే ఆయన పేరును కూడా పరిశీలిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయనకు ఛాన్స్ రాకపోతే రాయలసీమకు చెందిన బీసీ నేతల్లో ఒకరికి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. వీరిద్దరు మాత్రమే కాదు.. ఎన్నికల తర్వాత నుంచి ఎమ్మెల్సీ పదవుల రేసులో మరికొందరు నేతలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యే పిఠాపురం వర్మ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లు కూడా పదువులు ఆశిస్తున్నారు. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని రెండేళ్లుగా ప్రచారం జరుగుతోంది.. కానీ ఆయనకు ఇప్పటి వరకు పదవి దక్కలేదు. వంగవీటి రాధాకు గవర్నర్ నామినేటెడ్ కోటాలో పదవి వస్తుందని కొంతమంది సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. ఇక మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, కొమ్మాలపాటి శ్రీధర్‌లు గత ఎన్నికల్లో టికెట్ ఆశించినా దక్కలేదు.. దీంతో వీరు కూడా ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నారు. మరి టీడీపీ అధిష్టానం ఎవరికి ఛాన్స్ ఇస్తుందన్నది చూడాలి.

## కొత్తగా ల్యాండ్‌పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఆమోదించింది. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ, గ్రామ కంఠాల్లో భూములు కోల్పోతున్న వారికి ఏడాదికి రూ.10,000 ఇచ్చేందుకు ఆమోదించమని తెలిపారు. కొత్తగా పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములిచ్చే రైతుల కుటుంబాలకి రుణ మాఫీ చేసేందుకు అథారిటీ నిర్ణయించిన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సంవత్సరం జనవరి 6వ తేదీ లోపు లోన్ తీసుకున్న వారికి అమలు చేసేలా నిర్ణయించామని వెల్లడించారు.

**అమరావతిలోని 25 టౌన్ షిప్‌లలో**

అదేవిధంగా ఇనామ్ భూములకొరకు దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపిన్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలోని 25 టౌన్ షిప్?లలో ఒక్కో టౌన్ షిప్?లో తప్పనిసరిగా ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం చెప్పారని నారాయణ వెల్లడించారు. ఈ రాత్రిలోగా ల్యాండ్ పూలింగ్?కు భూములివ్వని వారికి రేపు(బుధవారం) భూసేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తామని వివరించారు. 2024 జూన్ నుంచి భూములిచ్చే వారికి కౌలు రూ.40 వేలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపాం. భూములు ఇచ్చినప్పటి నుంచి 10 ఏళ్ల పాటు ఇది అమలులో ఉంటుంది. జరీబు భూమికి రూ.5 వేలు, మెట్ట భూమికి రూ.3 వేలు పెంచేందుకు ఆమోదం. ఎక్కడైతే ట్రంక్ రోడ్లు, గ్రామాలపై పోతుందో అక్కడ లే అవుట్ వేసి ఎంత భూమి పోతుందో దానికి సమాంతరంగా ఇచ్చే విధంగా నిర్ణయించాం. అలాగే భూములిచ్చే రైతుల కుటుంబాలకి రుణ మాఫీ చేయాలని నిర్ణయించాం. ఈ సంవత్సరం జనవరి 6వ తేదీ లోపు లోన్ తీసుకున్న వారికి ఇది వర్తిస్తుంది. రాత్రిలోగా భూములివ్వని వారికి రేపు భూసేకరణ అమలు చేస్తాం. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేశాం."

వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చ : సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు.

## సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు

-మొదటిపేజీ తరువాయి

హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు. "సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. కళాకారుల అద్భుత ప్రతిభ వారి కష్టాన్ని గుర్తించడానికి వచ్చా. అద్భుత కళల వెనుక లక్షలమంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారు. రాష్ట్రంలో రెండు లక్షలమందికి పైగా కళాకారులు ఉన్నారు. మూడో వంతుకు పైగా అవార్డులు సాధించామంటే కళాకారుల ప్రతిభకు ఇదే నిదర్శనం. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దిశ. గుర్రపుడెక్క ఆకుతో కూడా వస్తువుల తయారీ చూస్తున్నాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు, పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. ల ఒక ఇంటి నుంచి ప్రారంభమైన వస్తువుకు ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ లభిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి, ప్రపంచానికి చేరాలనేదే లక్ష్యం. తల్లిదండ్రుల కళను పిల్లలు కూడా అనుసరించేలా చేయాలి. మనందరం కలిసి కళాకారులను ప్రోత్సహిద్దాం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు, లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పనిచేద్దాం. ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

అనారోగ్య సమస్యల నుంచి కళాకారులను కాపాడాలి. తొలుత కళాకారులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలి. వంశపారపర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాలి. వస్తువుల తయారీలో కొత్త ఆవిష్కరణలు రావాలి" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

"కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలి. సంప్రదాయం గుర్తుచేసుకోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలి. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశాం. హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడుతుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానం చేయాలి. హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిస్తా."

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

-మొదటిపేజీ తరువాయి

వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

**కీలక సేవలు నిలిచిపోవద్దు**

పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

## విజయనగరంలో రియల్ జోరు...

**విజయనగరం :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ఉత్తరాంధ్ర తలరాతను మార్చబోతోంది ఈ విమానాశ్రయం. అయితే ఎయిర్పోర్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజయనగరం జిల్లా సరిహద్దులతోపాటు భోగాపురం చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూములతో పాటు ఇళ్ల స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టేందుకు భారీగా ముందుకు వస్తున్నారు. సాధారణంగా వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తుంటారు. కానీ భోగాపురంలో ఓపెన్ ప్లాట్ల వెంచర్ల స్థానంలో.. సరికొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమర్షియల్ విల్లా ప్రాజెక్టులు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి.

# జీవో 396 రద్దు చేయాలంటూ కోరుకొండలో దస్తావేజు లేఖర్ల 'పెన్ డౌన్'

**రిజిస్ట్రేషన్లు నిలిపివేసి కోరుకొండలో దస్తావేజు లేఖర్ల ఆందోళన.**

**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) జులై 07::** రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోరుకొండలో 'పెన్ డౌన్' నిరసన కోరుకొండ, ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన జీవో నెంబర్ 396ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో 'పెన్ డౌన్' (విధుల బహిష్కరణ) మరియు నిరసన కార్యక్రమం నిర్వహించారు.రిజిస్ట్రేషన్ల వ్యవస్థను పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు మరియు డీటీపీ ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు.లేఖర్ల ఆందోళన ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది దస్తావేజు లేఖర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని, ఈ కొత్త జీవో వల్ల వారి ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.సేవలను ప్రైవేట్ సంస్థలకు లేదా సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల రిజిస్ట్రేషన్ ఫీజులు పెరిగి, ఇళ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేసే సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి




జీవో 396ను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ పెన్ డౌన్ నిరసన కారణంగా కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల తయారీ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు మరియు స్టాంప్ వెండర్లు.

# సీడ్ బాల్స్ తో అడవుల అభివృద్ధి!..







## అమూల్యమైన సహజవనరులే లక్ష్యంగా!..

### ఎఫ్.బి.వో! ఎస్ ఆదిలక్ష్మి!..

**వి.ఆర్.పురం,జూలై7(ప్రజాజ్యోతి ప్రతినిధి)**షీడ్ బాల్స్ ప్రత్యేకత,ఏంటంటే విత్తనాన్ని పక్షులు,జంతువులు,తినకుండా మొక్కలుగా అభివృద్ధిచేందుకు,అద్భుతమైన ప్రణాళికలతో అధికారులు,వృద్ధి (డౌలఫ్)చేశారని,దానికి ప్రభుత్వ తోడ్పాటు అందించడంతో అద్భుత ఫలితాలు సాధించేందుకు, అడవులు వృద్ధి చెందేందుకు,ఎంతో ఉపయోగపడతాయని, ఎఫ్.బి.వో, ఎస్ ఆదిలక్ష్మి, చెప్పారు. మంగళవారం ఈ సందర్భంగా మీడియాకు కొన్ని విషయాలు చెప్పారు.జీడిగుప్ప బీట్, ధారపల్లి బేస్ క్యాంపు,అటవీప్రాంతంలో హెల్పర్స్, స్వచ్ఛసేవక్ ల,సహాకారతో సీడ్ బాల్స్ విత్తనాలుచల్లామని వివరించారు.అడవులు వృద్ధిచెంది పర్యావరణ పరిరక్షణకు ఎంతోమేలు చేస్తుందని, పేర్కొన్నారు. వర్షాలు విరివిగా కురిసినా, సీడ్ బాల్స్,విత్తనాలు100%మొలకెత్తే అవకాశాలు ఉంటాయని తెలిపారు.సీడ్ బాల్స్ చేసి చల్లడం వల్ల చల్లినదగ్గరే మొల కెత్తుతాయని, స్పష్టంచేశారు.అడవులు అంతరించిపోకుండా అద్భుతమైన కార్యక్రమానికి అడవీశాఖ మంత్రి,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,నిర్ణయం మంచి ఫలితాలు వస్తాయని,సీడ్ బాల్స్,విషయంలో డిపార్ట్మెంట్, అధికారులు,సిబ్బంది శ్రద్ధతో పనిచేస్తున్నామని అన్నారు. చెట్లను కాపాడేందుకు,చెట్లను పెంచేందుకు,ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. చెట్లు ఆరోగ్యానికి, వర్షపాతం పెంపునకు దోహదపడతాయని, వివరించారు. అమూల్యమైన సహజ వనరులు,స్వచ్ఛమైన గాలిని అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయని,వీటి ద్వారా ఎన్నో ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయన్నారు. భూమి యొక్క వాతావరణం, గాలి, నీటి,వ్యవస్థలను కాపాడటానికి అడవులు చాలా కీలకమైనవని,చెప్పారు.ఒకప్పుడు అడవిగా ఉన్న భూమిని ఇతర అవసరాలకోసం చదును చేయడమే జీవనవైవిధ్య నష్టానికి ప్రధాన కారణాలలో ఒకటని అందుకే "సీడ్ బాల్స్"ద్వారా అభివృద్ధిచేస్తే దట్టమైనఅడవులు ఏర్పాటు ఔతాయని వివరించారు. జీడిగుప్ప,ఆర్.వో,ఎం.శ్రీనివాస్ రెడ్డి,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా పరిషత్ డిప్యూటీ సీ.ఈ.ఓ,ఎన్ రామచంద్ర!




**చెన్నూరు, జూలై 7(ప్రజాజ్యోతి ప్రతినిధి)**వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి,డిప్యూటీ సి.ఈ. ఓ,జిల్లా పరిషత్, మంగళవారం చెన్నూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు,అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జనరల్ ఫండ్ ఖాతాలు, 15వ ఆర్థిక సంఘం (ఎఫ్.ఎఫ్.సి) గ్రాంట్‌కు సంబంధించిన రికార్డులు, స్వచ్ఛ రథం నిర్వహణకు సంబంధించిన లాగ్‌బుక్, సిబ్బంది హాజరు రిజిస్టర్,నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, కార్యాలయ నిర్వహణ రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.స్వచ్ఛ రథం నిర్వహణ, ఇంధన వినియోగం, వాహన నిర్వహణ వివరాలు, లాగ్‌బుక్ నమోదు తదితర అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు అన్ని నమోదులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా స్పందించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ తనిఖీ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎం.పి.డి.వో),కార్యాలయ సిబ్బంది,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

-- ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు




చెన్నూరు మండలంలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు ఆదేశించారు.చెన్నూరు మండలంలో పర్యటించిన ఆయన, దీూలు 67,69,70 71పరిధిలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా దీూలతో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి దరఖాస్తును నాణ్యతతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దీూ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా ప్రతిరోజూ గణనీయమైన పురోగతి సాధించాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో అవసరమైన ధృవీకరణ పూర్తి చేసి, డేటాను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని తెలిపారు. పనుల నాణ్యతతో పాటు వేగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు.అలాగే, జూలై 7న జరిగే కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నాటికి ప్రతి దీూ కనీసం 65 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని గౌరవ జిల్లా కలెక్టర్ గారు ఆదేశించినట్లు శ్రీ కిరణ్ మోహన్ రావు తెలిపారు. ఆ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సాధించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చెన్నూరు మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలిపే విధంగా అందరూ సమిష్టిగా కృషి చేసి, 100 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయుటలో భాగంగా దీూలకు సహకరించేందుకు స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది, వెంకటేష్ వెలుగు ూావీ మరియు వారి సిబ్బంది, సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ూచీవీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.ఎంపిడిఓ, చెన్నూరు

## 90% సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీ ప్రారంభం... రైతులకు భారీ ఊరట!

**డి-కృషి యాప్ ద్వారా ఆన్‌లైన్ పంపిణీ.. 100% సబ్సిడీతో కందుల విత్తనాలు కూడా అందుబాటులో**



**కూనవరం, జూలై 7:** ప్రజా జ్యోతి పోలవరం జిల్లా కూనవరం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం టి యు-1121 రకం విత్తనాలను రూ.126కు, బి పి టి-5204 రకం విత్తనాలను రూ.108కు రైతులకు అందజేశారు.అలాగే వరి పొలాల గట్లపై సాగు చేసేందుకు కందుల విత్తనాలను 100 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ పథకం రైతులకు సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు దిగుబడులు పెంచేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. దేవి, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.రైతులకు ముఖ్య సూచన ఈ విత్తనాల పంపిణీ మొత్తం "డి-కృషి" యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతోంది. విత్తనాలు పొందాలనుకునే రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన పట్టాదార్ పాస్‌బుక్, మొబైల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

## పాముకాటుకు గురైన కొండరెడ్డి యువతిని పరామర్శించిన ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

**భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సన్మకప్రియకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే**

**మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచనలు**



**కూనవరం, జూలై 7 (ప్రజాజ్యోతి):** కూనవరం మండలం కార్మాన్‌కొండ గ్రామానికి చెందిన ఆదివాసి కొండరెడ్డి యువతి సన్మకప్రియ పాముకాటుకు గురై భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. బాధిత యువతి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే యువతి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముర్ల రమేష్ మాట్లాడుతూ, బాధిత యువతిని పరామర్శించి మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావుకు ఆదివాసి కొండరెడ్ల సంఘం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే చూపిన మానవత్వం ఆదివాసి కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు.

## సీపీఎం చొరవతో గోలగట్ట వంతెనకు మరమ్మతులు

**ప్రమాదకరంగా మారిన వంతెనను బాగు చేస్తున్న అధికారులు**

**ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగేలా చర్యలు**



**ఎటపాక, జూలై 7 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గోలగట్ట గ్రామంలో ఉన్న వంతెన వరదల కారణంగా దెబ్బతింది. వంతెన గోడలో సగం భాగం కూలిపోవడంతో మోటారు వాహనాల రాకపోకలకు తీవ్ర ప్రమాదం ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన సీపీఎం నాయకులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెంటనే స్పందించి వంతెనకు మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు భద్రయ్య, పార్టీ శాఖ కార్యదర్శి పెనుబల్లి భీష్మారావు (పెసా కార్యదర్శి), పార్టీ సభ్యుడు బుద్ధుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అధికారులు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి వంతెనను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

## బాలలహక్కులరక్షణకు కమీషన్ పనిచేస్తుంది!..

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు!..**



**వి.ఆర్.పురం,జులై7(ప్రజాజ్యోతి ప్రతినిధి)**బాలల హక్కులు పరిరక్షణకు కమీషన్ పనిచేస్తుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర,బాలలహక్కులరక్షణ కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, స్పష్టం చేశారు. మంగళవారం అనకాపల్లి జిల్లా ఆర్డీవో కార్యాలయంలో బాలలహక్కుల పరిరక్షణపై జరిగిన లైన్ డిపార్ట్మెంట్ రివ్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బాలలహక్కుల రక్షణ కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, మాట్లాడుతూ, బాలల హక్కుల రక్షణలో కమీషన్ ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు. అనంతరం"గోడ పత్రిక" ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బాలలహక్కుల కమీషన్ సభ్యులు మందాల గంగ సూర్యనారాయణ,తదితరులు హాజరయ్యారు.

## మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చీ రామచంద్ర గారు




**చెన్నూరు, జూలై 7:** వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి గారు మంగళవారం చెన్నూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జనరల్ ఫండ్ ఖాతాలు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్‌కు సంబంధించిన రికార్డులు, స్వచ్ఛ రథం నిర్వహణకు సంబంధించిన లాగ్‌బుక్, సిబ్బంది హాజరు రిజిస్టర్, నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, కార్యాలయ నిర్వహణ రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు.అలాగే మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.స్వచ్ఛ రథం నిర్వహణ, ఇంధన వినియోగం, వాహన నిర్వహణ వివరాలు, లాగ్‌బుక్ నమోదు తదితర అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు అన్ని నమోదులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా స్పందించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యత, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఎంపిడిఓ, చెన్నూరు

## రేపు బనగానపల్లెకు రాష్ట్ర ముఖ్య మంత్రి సీబీఎన్ రాక



**బనగానపల్లె :జులై =07 ప్రజాజ్యోతి** మీభూమి మీహక్కు కార్యక్రమంలో బాగంగా రేపుబనగానపల్లెకు రాష్ట్ర ముఖ్య మంత్రి రాక రైతు హక్కులకు మరింత భరోసా కల్పించే దిశగా రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జూలై 9, ఉదయం 10:00 గంటలకు, బనగాన పల్లె హైస్కూల్ గ్రౌండ్‌లో జరగనుంది. రైతులు, కూటమి నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శీ గడ్డం రామకృష్టారెడ్డి పిలుపు నిచ్చారు

## ఉచిత క్యాన్సర్ పరీక్షల మహో శిబిరం ఆరోగ్యమే మహాభాగ్యం

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**నంద్యాల:జులై=07 ప్రజాజ్యోతి** సమాజ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రాయలసీమ ఫౌండేషన్ సహకారంతో రూ.15,000 విలువైన ఉచిత క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు.నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉచిత వైద్య శిబిరం తేదీలు, ఈ నెల 12 వ తేదీ నందికొట్కూ రు నియోజకవర్గం నెహ్రూ నగర్ గ్రామంలో, ఈ నెల 13 వ తేదీ నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హల్ లో, ఈ నెల 14 వ తేదీన డోన్ పట్టణంలో ప్రత్యేకంగా ఉచిత కాన్సర్ పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ముందస్తు పరీక్షల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

## విందు ఆహ్వానానికి హాజరైన కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె :జులై=07 ప్రజాజ్యోతి** బనగానపల్లె పటణం జియస్ యస్ ఫంక్షన్ హాల్ నందు అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి గారు అమ్మవారి మొక్కుబడి సందర్భంగా విందు ఆహ్వానానికి హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ పాణ్యం మాజీ శాసన సభ్యులు,నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి సతీమణి కాటసాని సులోచనమ్మ ,వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి రాష్ట్ర వైఎస్సార్సీపీ కార్యదర్శి కాటసాని నరసింహా రెడ్డి ,కాటసాని వెంకట సాయి నాగిరెడ్డి పాల్గోన్నారు

# 12వ పిఆర్సి కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలి





**జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి సుంకన్న**

**హోళగుంద, జూలై 7, ప్రజా జ్యోతి న్యూస్ –** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన ప్పటికీ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలైన 12వ పి ఆర్ సి కమిటీ ఏర్పాటు, ఐ .ఆర్. మంజూరు, ఆర్థిక బకాయిల చెల్లింపు, సిపిఎస్ రద్దు తదితర ప్రభుత్వ మేనిఫెస్టో హామీలను అమలు చేయలేదని వెంటనే 12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి 30% ఐ.ఆర్. ప్రకటించాలనిరాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి సుంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ టి యు మండల శాఖ అధ్యక్షులు కె శరణభసప్ప మరియు మండల ప్రధాన కార్యదర్శి డి పాండు రంగ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి సుంకన్న, మండల ఆర్థిక కార్యదర్శి కే శ్రీనివాసులు, మండల గౌరవ అధ్యక్షులు ఎస్ పోతరాజు, మండల సహా గౌరవ అధ్యక్షులు జి దొడ్డ బసప్ప, మొదలైన వారు పాల్గొన్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి సుంకన్న మాట్లాడుతూ 11వ పిఆర్సి గడువు పూర్తయి 30 నెలలు గడిచిన ఇంతవరకు 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయలేదని, 2023 జులై నుండి అమలు కావలసిన 12వ పి ఆర్ సి కమిటీని ఏర్పాటు చేసి పి ఆర్ సి అమలు ఆలస్యమవుతున్నందున 30% ను ప్రకటించాలని కోరారు. 2024 జూన్ నాటికి గత ప్రభుత్వంలో దాదాపు 23 వేల కోట్లు ఆర్థిక బకాయిలు పెండింగ్ ఉండగా ప్రస్తుత సమయా నికి ఆర్థిక బకాయిలు సుమారు 34 వేల కోట్లకు చేరడం శోచనీయమని, ఇందులో 11వ పిఆర్సి బకాయిలు డిఏ బకాయిలు సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్ మెడికల్ బిల్లుల చెల్లింపులు వంటివి ఉన్నాయని కావున ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్థిక బకాయిల చెల్లింపులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా సి పి ఎస్ అంశాన్ని ఇంతవరకు పునసమీక్షించలేదని రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఉద్యోగ కార్మికులకు సిపిఎస్ కు ప్రత్యామ్నాయం ఓ పి ఎస్ అని కావున వెంటనే రాష్ట్రంలో ఓ పి ఎస్ అమలు చేయాలనిపదవి విరమణ పొందిన ఉపాధ్యా య ఉద్యోగులకు 15 నెలలుగా గ్రాడ్యుటీ చెల్లించలేదని, ఇ.ఎల్., ఎన్ క్యాష్మెంట్ బిల్లులు 3 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే వీటి చెల్లింపులను పూర్తి చేయాలని కోరారు ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లకు చెల్లించాల్సిన 4 డి ఎ లను వెంటనే చెల్లించాలి.ఈ హెచ్ ఎస్ కార్డు ద్వారా రెఫరల్ హాస్పిటల్స్ లో అన్ని రకాల వ్యాధులకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పూర్తిస్థాయి లో అమలు చేయాలి ,2025 లో బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి, నాలుగు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ ను రూపొందించి అమలు అమలు చేయాలని గత ప్రభుత్వం శాసనమండలిలో ఇచ్చిన లిఖితపూర్వక హామీ మేరకు కేజీబీవీ నందలి బోధన సిబ్బందికి ఎంటిఎస్ విధానాన్ని అమలు చేయాలి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్న టెట్ మినహాయింపు కొరకు విద్య హక్కు చట్టంలోని 23(1) సెక్షన్ సవరించి ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా పార్లమెంట్ చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి గాదిలింగప్ప, ఎన్ ఈరన్న, డి చిన్నప్పరెడ్డి, వై వెంకటేష్, బీ టి ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

# ‘సర్’ కాల వ్యవధిని పెంచాలి

**అధికార పత్రం బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉండాలా.**

**ఉపా చట్టాన్ని రద్దు చేయాలి దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ**

**రైతులను ఆదుకోవాలి అయోధ్య సొత్తు ఎవరి పాలు**

**ఆగస్టు నుంచి 6 నుంచి 15 వరకు ప్రచార పోరాట కార్యక్రమాలు**

**సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**



**నంద్యాల:జులై=07 ప్రజాజ్యోతి** రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్రియ ఇప్పటి వరకు 45 శాతం కూడా జరగలేదని గణాంకాలు చెబుతుండగా ఎన్నికల కమీషనర్, జిల్లా కలెక్టర్లు ఓటర్ల హక్కులను కోల్పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పించాలంటే ప్రస్తుత సమయం సరిపోదని, ఓటర్ల జాబితా ప్రక్రియకు సంబంధించి మరో మూడు మాసాలు గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధికారులను డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను నిర్వహించే అధికారులకు, ప్రజలకు ఓటర్ల ప్రక్రియపైన పూర్తి అవగాహన లేకపోవంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారని దీని వలన గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంగళవారం హోచిమిన్ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న అనేక రాజకీయ అంశాలపైన ప్రజా హక్కులపైన రైతుల ఆందోళనలపైన అయోధ్య రామమందిరంలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపైన సమగ్రంగా వివరిస్తూ దేశ ప్రజల సమస్యలపైన అలుపెరుగని పోరాటంతో దశలవారీగా ముందుకు వెళతామన్నారు. ఓటర్ల జాబితా కోసం నియమించిన అధికారులకు సాంకేతిక పరమైన అవగాహన లోపాలు ఉన్నాయని గుర్తింపు కార్డుల పరిశీలన 2002 ముందు కంటే ఓటర్ల జాబితా పైన సరైన అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పాసుపోర్టులు కూడా ప్రయాణానికి ఉపయోగించే ధృవీకరించే పత్రంలాగా గుర్తిస్తు న్నాయని అంతేకాకుండా ఆధా ర్కార్డు, రేషన్కార్డు, పాన్కార్డు ఇలాంటి అనేక కార్డులకు కూడా విలువ లేకుండా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలనను సాగిస్తుందని ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పాలనకు చంద్రబాబు, పవన్కల్యాణ్, జగన్మోహన్రెడ్డిలు తొత్తులుగా వ్యవహరిస్తూ తానా అంటే తందానా అని వంత పాడుతున్నారని విమర్శించారు. భారతదేశ పౌరుడిగా ఉండాలంటే బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉంటే సరిపోతాయా అని ఆయన ప్రశ్నించారు.

# హోళగుందలో మిన్నంటిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు






**16 గ్రామాల్లో ఎగిరిన మాదిగ దండోరా జెండాలు**

**ఉద్యమ స్ఫూర్తితో సామాజిక న్యాయం సాధిద్దాం**

**ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల పిలుపు**

**హోళగుంద, జూలై 7, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినం మరియు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉద్యమ స్ఫూర్తితో అత్యంత ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మండలంలోని దాదాపు 16 గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి, అణగారిన వర్గాల ఆత్మగౌరవ నినాదాలతో హోళగుంద మండలాన్ని దద్దరిల్లేలా చేశారు.ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎస్. కెంచప్ప, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు దేవప్ప, ఆలూరు నియోజకవర్గ కో–ఇన్‌చార్జి మల్లికార్జున, డివిజన్ నాయకుడు పంచగుండిగ వెంకటేష్, బహుజన టైమ్స్ ఎండీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని జెండాలను ఆవిష్కరించారు.

**అణగారిన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ:**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అప్రతిహత పోరాట యోధుడని కొని యాడారు. మాదిగ దండోరా ఉద్యమం ద్వారా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని దేశవ్యాప్తంగా కదిలించిన మహానాయకుడు ఆయనేనని స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు.

**యువత ఉద్యమాల్లోకి రావాలి:**

యువత అంతా మందకృష్ణ మాదిగ గారి ఉద్యమ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా, నిర్భయంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆశయాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లడం, దళిత, బహుజన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి పక్కిరప్ప, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పల్లె ఈరన్న, చిన్నయాట మల్లి, గోవర్ధన్, శేషగిరి, గోవిందు, తిక్కన్న, లక్ష్మీకాంత్, వెంకటేష్, తప్పెట మల్లికార్జున, నగేష్, దావీదు మంగన్న, సాయిబేస్, నాగరాజు, రమేష్, మల్లయ్య, క్యాంప్ కల్లప్ప, బుడగ జంగాల మండల నాయకులు రామంజి, అంజిని, నాగప్ప, చిన్న చిట్టి, తమన్నా, రామదాసులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ పెద్దలు, యువకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెగా డి ఎస్ సి ద్వారా మండలంలో టీచర్ల కొరతకు పరిష్కారం





------ ఎం ఈ ఓ సుధారాణి..

## సజావుగా మండల సర్వసభ్య సమావేశం

**హోళగుంద, జూలై 7, ప్రజా జ్యోతి న్యూస్ -** మండలంలో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న టీచర్ల కొరత మెగా డి ఎస్ సి ద్వారా పరిష్కారం లభించిందని,తద్వారా మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని ఎం ఈ ఓ - 1 సుధారాణి పేర్కొన్నారు. ఎం పి డి ఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీవో సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో ఎం పి పి నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం సజావుగా జరిగింది.సమావేశానికి మండల స్థాయిలోని ఆయన సంకల అధికారులు హాజరై నివేదికలు, తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర విషయాలు చర్చించారు.ముందుగా ఎం పి డి ఓ సయ్యద్ ఉమర్ సమావేశ ఎజెండాలు వినిపించారు.అనంతరం విద్య శాఖపై ఎం ఈ ఓ సుధారాణి మాట్లాడుతూ మండలంలో మెగా డి ఎస్ సి ద్వారా 124 మంది కొత్త ఉపాధ్యాయులు రావడంతో మండల విద్యాశాఖలో ప్రధాన సమస్య అయినా టీచర్ల కొరత పరిష్కరించబడిందని అన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని ఇందులో భాగంగా ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షలు మంచి ఫలితాలు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయని అన్నారు. బడికి పోదాం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయని ఎంఈఓ సుధారాణి స్పష్టం చేశారు. ఎంపీటీసీ మల్లికార్జున మాట్లాడుతూ మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ పున ప్రారంభించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం తీసుకున్న దృష్టికి తీసుకెళ్లి ఎస్ సి హాస్టల్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతపురం ఐ సి డి ఎస్ సూపర్వైజర్ పద్మావతమ్మ మాట్లాడుతూ మండల కేంద్రంలోని 1 మరియు 7 అంగన్వాడి కేంద్రాలతో పాటు పెద్ద గోనెహాలు గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్ నీలా మాట్లాడుతూ మండలంలోని కడ్లేమాగి ఎస్ ఎస్ ట్యాంక్, హెబ్బటం ఎస్ ఎస్ ట్యాంక్ లలో 30- 40% నీరు నిల్వ ఉన్నాయని, ఆగస్టు 15 వరకు ఎలాంటి అంతరాయం లేకుండా నీటిని సరఫరా చేసే విధంగా నిల్వ ఉందని తెలిపారు. ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన వి బి జి రామ్ జి పథకంపై ఏపీవో తిమ్మారెడ్డి వివరించారు. పంచాయతీరాజ్ ఏఈ యమునప్ప మాట్లాడుతూ మండలంలో జడ్పీ నిధులలో 20 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో కొగిలతోట మరియు మండల కేంద్రంలో సిసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం పి టి సి లు,ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## క్రీస్తు రాజు నూతన ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి హాజరైన శ్రీమతి బీసీ ఇందిరారెడ్డి



**బనగానపల్లె :జులై=07 ప్రజాజ్యోతి** బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు రాజు నూతన దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి హాజరైన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి . గతంలో చర్చ్ నిర్మాణం కొరకు బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల రూపాయలు మంజూరు చేశారు.

## నూతన చర్చి ప్రారంబోత్సవ కార్యక్రమానికి హాజరైన కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె :జులై=07 ప్రజాజ్యోతి** బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్సీపీ నాయకులు తూర్పింటి శ్రీనివాసరెడ్డి, రామేశ్వర్ రెడ్డి,పెద్ద నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చర్చిఫాదర్ సూరిపోగుల ప్రకాశ్, బాలవెంకట, రాజశేఖర్ తదితరులు పాల్గోన్నారు

## ఘనంగా ఎంఆర్ పియస్ ఆవిర్భావ దినోత్సవం!..



**కోవెలకుంట్ల,జులై07(ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఎం.ఆర్.పి.యస్ ఆవిర్భవదినోత్సవం మరియు పద్మశ్రీ మందకృష్ణమాదిగ, పుట్టినరోజు సందర్భంగా కోవెలకుంట్ల మండలం కోవెలకుంట్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాఎగరవేయడం మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా కేక్ కటింగ్ చేయడం జరిగింది. అలాగే గవర్నమెంట్ హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు అనారోగ్య పేషెంట్లకు బ్రెడ్ పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి,పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి బోడెమ్మను రాజు మరియు కోవెలకుంట్ల మండలం ఇన్చార్జి ఇరికే మాను నాగేశ్వరరావు,న్యాయవాదుల బృందం సభ్యుడు కన్నెలూరి రమేష్, కోవెలకుంట్ల మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నిలువగండ్ల నవీన్,ఎమ్మార్పీఎస్, కోవెలకుంట్ల టౌన్ అధ్యక్షుడు అరదేశి రమేష్ మరియు ఎమ్మెస్ పి కోవెలకుంట్ల మండల అధ్యక్షుడు దండు రామసుబ్బయ్య,ఎం.ఎస్.పి ఉపాధ్యక్షుడు మల్లెపూల ఆదిశేషు, కోవెలకుంట్ల మాదిగ ప్రజలు జయరాజ్ (రిటైర్డ్ టీచర్ )ఆర్లప్ప,ఆటో యూనియన్ లీడర్ రఘు,విజయ్ జయసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో ఏళ్ల సమస్య కు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



**బేతంచెర్ల: జూలై 7,(ప్రజా జ్యోతి)**బేతంచర్ల మండలం బుక్కాపురం గ్రామపంచాయతీ పరిధిలో రంగాపురం రైల్వే స్టేషన్ సమీపంలో నివసిస్తున్న సుమారు 15 కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, రహదారి వంటి మౌలిక వసతుల సమస్యలను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోట్ల సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు త్వరితగతిన కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. డోన్ నియోజకవర్గంలో ఏ గ్రామం, ఏ కాలనీ అభివృద్ధికి దూరంగా ఉండకుండా ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోట్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య , మాజీ ఎంపీపీ గూటుపల్లె సోమశేఖర్ రెడ్డి , కృష్ణవర్ధన్ రెడ్డి ,భాస్కర్ రెడ్డి టిడిపి నాయకులు వారాల రాముడు లొడ్డ రామమద్దయ్య నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడ్డ శేఖర్,

## ఓటర్ వేరిఫికేషన్లో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి!..

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్!..





**వి.ఆర్.పురం,జులై7(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం ప్రతీ ఒక్క కుటుంబంలో,ప్రతీ ఒక్కరు విధిగా చేయించుకోవాలని, జరగాలని, తెలుగు దేశంపార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,పేర్కొన్నారు. మంగళవారం వడ్డి గూడెం, గ్రామ పంచాయతీ లో, బి.ఎల్.వో, బి.ఎల్.ఏ,లతో కలిసి జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించారు. తదు పరివారి తో అనుసంధానమై చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతీ ఒక్కరు ఓటర్, వేరిఫికేషన్ లో పాల్గొని అధికారులకు సహాకరించాలని,విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలన కార్య క్రమంలో జడ్పీ. టీ.సీ ముత్యాల రామారావు, ముత్యాల చంద్ర శేఖర్, ముత్యాల శంకర్రావు, చక్రపాణి, శ్రీధర్, బింగి విష్ణుమూర్తి,సచివాలయ సిబ్బంది, బి.ఎల్.ఏ.లు తదితరులు పాల్గొన్నారు.

## బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఎగుమతి ఆధారిత ఉద్యాన పంటలపై శిక్షణ

- డాక్టర్ కె రాఘవేంద్ర చౌదరి




**ఎమ్మిగనూరు జూలై 07 (ప్రజాజ్యోతి ):**మండల పరిధిలో ని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా ఉద్యానశాఖ, నాబార్డ్ మరియు జిల్లా సహకార బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో పండ్లు, కూరగాయలు, మిరప పంటల ఎగుమతి అవకాశాలు, నాణ్యతా ప్రమాణాలు, గరిష్ట పురుగుమందుల అవశేష పరిమితులు కోతానంతర నిర్వహణ, విలువాధారిత ఉత్పత్తులు, మార్కెట్ లింకేజీలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి డా. కె. రాఘవేంద్ర చౌదరి అధ్యక్షత వహించగా, డా. బి. సుజాతమ్మ, డా. వై. మౌనిక, ఉద్యానశాఖ అధికారులు మరియు బిజినెస్ మేనేజర్ పెద్దిస్వామి పాల్గొని, ఎగుమతుల కోసం అంతర్జాతీయ ప్రమాణాల మేరకు నాణ్యమైన ఉత్పత్తి, పురుగుమందుల అవశేషాల నియంత్రణ, విలువాధారిత ఉత్పత్తుల తయారీ, అలాగే పీఎంఫమ్ పథకం ద్వారా సోలార్ డ్రైయర్లు, విలువాధారిత యంత్రాలకు లభించే సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, ఉద్యానశాఖ మరియు వ్యవసాయశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షం కోసం అమ్మవారికి పత్యేక పూజలు



**కౌతాళం జూలై 07 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం రోజున రైతులు వేసిన పంటలకు వర్షం రావాలని కోరుతూ కౌతాళం మండలంలో వెలిసిన శ్రీ మారికాంబ దేవి పాదాలకు 101 బిందె నీళ్లు మోసిన ముకన్నా కొడుకు సూరి మరియు రామకమ్మ దేవి పాదాలకు 101 బిందె నీళ్లు మోసిన కొండే ఈశ్వర్ కొడుకు రాము మోయడం జరిగింది. మరియు కౌతళం మండలం గ్రామస్తులు శ్రీ మారికంబ దేవి మరియు రామకమ్మ దేవికీ నైవేద్యం, టెంకాయలు కొడుతూ వర్షం రావాలని కోరుకున్నారు.

## ఎరువుల దుకాణంలో తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు



**నందవరం జులై 07 (ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో ని నాగలదిన్నెలో వ్యవసాయ అధికారి సరిత ఆధ్వర్యం లో మంగళవారం ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు దస్తగిరి రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కోరమాండల్ నాగలదిన్నె, నవీన్ ఫెర్టిలైజర్ నాగలదిన్నె, నందవరం సొసైటీ, కోరమాండల్ లో తనిఖీ చేశాము,వ్యవసాయ సంచాలకులు దస్తగిరి రెడ్డి ఆపైమ్స్ ద్వార యూరియా , డి ఎ పి పంపిణీ చేసిన రైతులకు రాండమ్ గా చరవాణి లో సంప్రదించగా రైతులు సానుకూల సమాధానం ఇవ్వడం జరిగినది.ముఖ్యంగా నందవరం మండలంలోని డీలర్లకు తెలియజేయడం అనగా రైతులు ఏవైతే ఎరువులు అడుగుతున్నారో అవి మాత్రమే రైతులకు విక్రయించాలి అలా కాకుండా లింకు ప్రొడక్ట్స్ ఏమైనా రైతులకు విక్రయిస్తే వారిపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 క్రింద మరియు ఈసీ యాక్ట్ 1955 తగు చర్యలు తీసుకోబడును మరియు లైసెన్స్ క్యాన్సిల్ చేస్తామని అని తెలియజేశారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించిన- ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర రెడ్డి



**నందవరం జులై 07(ప్రజా జ్యోతి ):** నందవరం గ్రామపంచాయతీ ఆవరణలో జూలై 11న నిర్వహించనున్న భారత రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆవిష్కరించారు.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు మరియు విద్య ద్వారా సాధికారత అనే ఆయన ఆశయాలను గుర్తు చేసే చారిత్రాత్మక సందర్భంగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మరియు సభ్యులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, నందవరం ఎస్సీ కాలనీ యువకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనున్నారు.

## శుభ కార్యానికి హాజరైన వైసీపి సీనియర్ నాయకులు




**బనగానపల్లె :జులై=07 ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గౌ. శ్రీ కాటసాని తిరుపాల్ రెడ్డిలి గారి ఆహ్వానం మేరకు ఈరోజు (07-07-2026) బనగానపల్లె పట్టణం కొండపేటలోని జిఎస్ ఎస్ ఫంక్షన్ హాల్ నందు జరుగుతున్న శుభకార్యానికి హాజరైన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు గౌ. శ్రీ చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి , వైఎస్ఆర్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మరియు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు గౌ. శ్రీ చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు గౌ. శ్రీ పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , శ్రీ చల్లా చరణ్ రెడ్డి . అనంతరం శుభకార్యానికి విచ్చేసిన నంద్యాల జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు గౌ. శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారితో, బనగానపల్లె మాజీ శాసనసభ్యులు గౌ. శ్రీ కాటసాని రామిరెడ్డి గారితో, బనగానపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ పరిశీలకులు గౌ. శ్రీ భూమా కిషోర్ కుమార్ రెడ్డి గారితో, వైఎస్ఆర్ సీపీ స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీ గౌ. శ్రీ కాటసాని ఓబుల్ రెడ్డి గారితో, వైఎస్ఆర్ సీపీ స్టేట్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు గౌ. శ్రీ కాటసాని శివ నరసింహారెడ్డి గారితో కాసేపు ముచ్చటించడం జరిగింది.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు బనగానపల్లెలో ఎ యస్ ఎల్ నిర్వహణ



**నంద్యాల:జులై=07 ప్రజాజ్యోతి** రేపు 9వ తేదీన బనగానపల్లెలో పర్యటించనున్న సందర్భం గా భద్రతా ఏర్పాట్లలో భాగంగా అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఎయస్ ఎల్ ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు మరియు భవనాల శాఖమంత్రి శ్రీ బీ.సీ జనార్దన్ రెడ్డి , నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ఐఎయస్ , నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ , సీఎం సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున , డీఎస్పీ చంద్రశేఖర్ ఐయస్ డబ్ల్యు (ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్) అధికారులు పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా పర్యటన మార్గాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బారికేడింగ్, వీఐపీ భద్రత, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవలు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

## గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు




**ప్రజా జ్యోతి , చెన్నూరు, జూలై 7:** మండలంలో ఓటరు సర్వే డిజిటలైజేషన్ పనులను ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రతి బీఎల్ఓ 65% లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. తప్పులు లేకుండా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసి మండలాన్ని ఆదర్శంగా నిలపాలని బీఎల్ఓలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సిబ్బందికి ఆయన సూచించారు.

## రోడ్డు మరమ్మతులతో ట్రాఫిక్‌కు అంతరాయం



**ఆమదాలవలస:: ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలో తిమ్మాపురం జంక్షన్ నుంచి స్థానిక వైఎస్సార్ కూడలి వరకు రహదారి మరమ్మతు పనులను అధికారులు మంగళవారం చేపట్టారు. పనుల కారణంగా సుమారు అర కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు దాదాపు 20 నిమిషాల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ట్రాఫిక్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

# కలప మాఫియా పై చర్యలేవి

దండంగి లో అక్రమ వెదురు నరికివేత ను సహకరిస్తున్నదెవరు?బీట్ అధికారిని నిర్లక్ష్యం తో అడవిని గుల్ల చేస్తున్న కలప అక్రమార్కులు..

అటవీ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం పై మండిపతున్న గిరిజనులు...

కలప మాఫియా ను అరికట్టకపోతే ఫారెస్ట్ అధికాల పై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామంటున్న స్థానిక గిరిజనులు..








**దేవీపట్నం జులై 7(ప్రజా జ్యోతి ):**రోజు రోజుకు రెచ్చిపోతున్న కలప మాఫియా పై పిర్యాదు చేసేందుకు సిద్ధం గా ఉన్నామని దేవీపట్నం గిరిజనులు ఓ ప్రకటన లో తెలిపారు దేవీపట్నం మండలం దండంగి నార్త్ జోన్ పరిధిలోని భారీ ఎత్తున అక్రమంగా వెదురు నరికివేత జరుగుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.అటవీ సంపదను రక్షించాల్సిన ప్రాంతంలోనే వెదురును విచ్చలవిడిగా నరికి తరలిస్తున్నారని, దీనివల్ల అడవి విస్తీర్ణం దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక గిరిజనులు నీడ కోసం నిర్మించుకునే తాటాకు ఇంటికోసం అడవికి వెళ్లి కలప తెచ్చుకునే సమయం లో ఈ ప్రాంత బీట్ అధికారిని గిరిజనులను భయభ్రాంతులకు గురి చేసిన ఘటన జరిగిందని స్థానిక గిరిజనులు వాపోయారు గత కొంతకాలంగా ఉదయం వేళల్లో వెదురు నరికివేత కొనసాగుతున్నప్పటికీ రాత్రి సమయంలో అక్రమ రవాణా కొనసాగుతుంది.సంబంధిత అటవీశాఖ సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకోలేకపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అక్రమంగా నరికిన వెదురును ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అడవుల్లో నిరంతర నిఘా, గస్తీ నిర్వహించాల్సిన అధికారులు ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు.ముఖ్యంగా సంబంధిత బీట్ అధికారుల పరిధిలోనే ఈ స్థాయిలో అక్రమ నరికివేత జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై గానీ, విధుల్లో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి.దీంతో అటవీశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పనితీరుపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అటవీ సంపదను పరిరక్షించాల్సిన శాఖే అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతోందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి,అక్రమ వెదురు నరికివేతకు పాల్పడుతున్న వారితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు,పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దండంగి నార్త్ జోన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ వెదురు తరలింపును పూర్తిగా అరికట్టాలని కోరుతున్నారు.

## నెరనికి తాండలో అంగరంగ వైభవంగా 'సాతి యాడి సీతలా' పండుగ





**హొళగుంద, జూలై 7, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని నెరనికి తాండ గ్రామంలో బంజారాల కులదైవమైన 7 గురు అమ్మవార్లు (సాతి యాడి సీతలా భవాని) పూజోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పండుగను పురస్కరించుకుని గ్రామ పెద్దలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి.

### పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు డాక్య నాయక్, దేవేంద్ర నాయక్, విజయ నాయక్, వెంకోబ నాయక్, వెంకటేష్ నాయక్ మరియు గ్రామ ప్రజలంతా కలిసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంలోని పిల్లలు, పెద్దలు ఎలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా అందరినీ చల్లగా చూడాలని వారు భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.తాండ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకల్లో బంజారాల సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## 2658 ఎకరాల వక్ఫ్ బోర్డు ఇనాం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం





**త్వరలో అధికారిక ప్రకటన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**బేతంచెర్ల : జూలై 7,(ప్రజా జ్యోతి)**బేతంచర్ల మండలంలోని గుట్టుపల్లె గ్రామంలో హుస్సేనాపురం, తవసికొండ, రెహమాన్‌పురం, నాగమల్లకుంట, గూటుపల్లె గ్రామాలకు చెందిన రైతులతో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం సమావేశమై వక్ఫ్ బోర్డు ఇనాం భూములకు సంబంధించిన సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో ఉన్న ఇబ్బందులు, సాగు హక్కుల విషయంలో ఎదురవుతున్న అవరోధాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలపై సమగ్రంగా వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వం చేపట్టిన చర్యలను వారికి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంత రైతులను వేధిస్తున్న వక్ఫ్ బోర్డు ఇనాం భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. రైతుల చట్టబద్ధమైన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఈ గ్రామాలకు చెందిన వక్ఫ్ బోర్డు ఇనాం భూముల సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తున్నదనీ, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది ఈ ప్రాంత రైతులకు ఎంతో ఆనందదాయకమైన, చారిత్రాత్మకమైన సందర్భంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వారి భూ హక్కుల రక్షణ తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ, ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల మండల టిడిపి కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య మాజీ ఎంపీపీ గూటుపల్లె సోమశేఖర్ రెడ్డి బిజెపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమోహన్ రెడ్డి టిడిపి నాయకుడు రామ్ తిమ్మారెడ్డి బేతంచర్ల బిజెపి నాయకుడు రమేష్ రాయల్ నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడ్డ శేఖర్ టిడిపి నాయకులు వారాల రాముడు ,లొడ్డ రామమద్దయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు



**కాట్రేనికోన ప్రజాజ్యోతి** డా బి ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మహిళల సంరక్షణకు తాము నిరంతరం పనిచేస్తూ ఉంటామని కాట్రేనికోన అదనపు ఎస్ ఐ. వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల నందు విద్యార్థినిలకు మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, వివాదాలకు దూరంగా ఉంటూ విద్యలో రాణిస్తూ జీవితంలో స్థిరపడాలని తెలియజేశారు. తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు వచ్చే విధంగా చదువులో రానిస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ ఎం నాగరాజు, పోలీస్ సిబ్బంది జే చిన్నారావు, కే ఎస్ రాజు, పి సతీష్ వర్మ, కళాశాల అధ్యాపకులు ఎం సతీష్, కే రవి, ఏ శ్రీనివాస్, డి హెచ్ వి సత్యనారాయణ, జే అశోక్, కే స్వామి, స్వర్ణ లత,ఎన్ రాజు, సి హెచ్ సంతోషి కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## సి.కె. దిన్నె పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు

ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశంలో పాల్గొని కీలక సూచనలు



**సి.కె. దిన్నె, ప్రజాజ్యోతి జూలై 8:** వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రవిబాబు బుధవారం సి.కె. దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను తనిఖీ చేశారు. అనంతరం ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే ఆశా కార్యకర్తల రెగ్యులర్ సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల పునశ్చరణ (రీ–ఒరియంటేషన్) అంశమైన "రక్తహీనత (ఐరన్ లోపం)"పై ఆశా కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించారు. రక్తహీనత రకాలు, దానికి గల కారణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలపై వివరించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.రాబోయే ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో కుటుంబ ఆరోగ్యం, మాతా–శిశు సంక్షేమం, జనాభా సమతుల్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. సమాజ ఆరోగ్య అధికారులు హిమబిందు, వేదవతి వివిధ అంశాలపై సూచనలు అందించారు. అనంతరం హెల్త్ సూపర్‌వైజర్లు జనార్దన్, గంగులమ్మ ఆశా కార్యకర్తల గత నెల క్షేత్రస్థాయి పనితీరును సమీక్షించి ధృవీకరించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ




**ఆమదాలవలస:::** ప్రజాజ్యోతి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్యామ్ సుందర్ 50 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ సూచించారు. లైబ్రేరియన్ ఎం. శ్రీ హరిరావు అధ్యాపకులు ఉన్నారు.

## శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షిక ఉత్సవం ఘనంగా నిర్వహణ



**బేతంచెర్ల, జూలై 7 (ప్రజా జ్యోతి)** బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జ్యేష్ఠ బహుళ సప్తమిని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షిక ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ, ఉప కమిషనర్ ఎం. రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ప్రాతఃకాలంలో సుప్రభాత సేవ, విశేష దివ్య పంచామృతాభిషేకం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అమ్మవారికి తిరుమంజనం, వేదోక్త మూలమంత్రాలతో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి బీజ సంపుటిత హవనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ఉత్సవమూర్తి సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక పూజలు సమర్పించారు. ఉత్సవ కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల హర్షధ్వానాల మధ్య వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో అర్చక పరివారం, వేద పండితులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వార్షిక ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ నిశాంత్ కుమార్



**లక్కిరెడ్డిపల్లి ప్రజా జ్యోతి, జూలై** లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామపంచాయతీ పరిధిలోని చౌటపల్లి రవీంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. నూతన భవనంతో పాటు చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, మెనూ అమలు, అనీమియా, తక్కువ బరువు ఉన్న చిన్నారుల వివరాలను పరిశీలించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వంటగది, ఆహార నిల్వలను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని, పరిశుభ్రత పాటిస్తూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు.

## శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే ఎన్ .ఈ.ఆర్ ,పిన్నింటి వెంకట భానోజీ నాయుడు

**- ఎన్.ఈ. ఆర్ జన్మదినం సందర్భంగా వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భానోజీ నాయుడు**



**రణస్థలం , ప్రజాజ్యోతి న్యూస్:** ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు జన్మదినం సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు ,ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు తో కలిసి కుటుంబ సమేతంగా కలియుగ దైవం అయినటువంటి తిరుమల వెంకటేశ్వర స్వామిని నిజరూప దర్శనంలో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఎన్.ఈ.ఆర్ ఆయురారోగ్యాలతో సుఖ శాంతులతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని భానోజీ నాయుడు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం పిన్నింటి భానోజీ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రజలు , రణస్థలం పంచాయతీ వాసులు సుఖ సంతోషాలతో ,ఆయురారోగ్యాలతో , పాడి పంటలతో జీవించేలా కలియుగ దైవం వెంకటేశ్వర ఆశీర్వాదం ప్రజలందరిపైన ఎల్లవేళలా ఉండాలన్నారు. అలాగే ఎమ్మెల్యే ఎన్.ఈ.ఆర్ ప్రజలకు మరింత చేరువై సేవలందిస్తూ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# గ్రామాల్లో వైయస్సార్ పార్టీకి భారీ షాక్ ఎమ్మెల్యే కోట్ల సమక్షంలో టిడిపిలో చేరిక




**బేతంచెర్ల : జూలై 7,(ప్రజా జ్యోతి)** బేతంచర్ల మండలంలోని రెహమాన్‌పురం గ్రామానికి చెందిన 11 కుటుంబాలు వైఎస్సార్సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే డోన్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారదర్శక పాలనపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నందునే అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా కలిసి పనిచేసి డోన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, మాజీ ఎంపీపీ గుటుపల్లె సోమశేఖర్ రెడ్డి , జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లొద్ద శేఖర్ టిడిపి నాయకులు వారాల రాముడు లొద్ద రామమద్దయ్య పార్టీలకు చేరిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శుద్ధ జల యంత్రాలు ఉన్న విద్యార్థులకు అందని స్వచ్ఛమైన తాగునీరు

**కరెంట్ లోవోల్టేజ్ సమస్య వల్ల విద్యార్థులకు అందని శుద్ధ జలం**

**ఇళ్ల నుంచే నీటి బాటిల్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు**






**కంబదూరు జూలై :7(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్** ఖాన్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శుద్ధ జల యంత్రాలు కరెంట్ లో వోల్టేజ్ కారణంగా పనిచేయకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ యంత్రాలు పనిచేయకపోవడంతో విద్యార్థులకు శుద్ధ జలం అందని పరిస్థితి నెలకొంది. కంబదూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 500 వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు'కార్యక్రమం ద్వారా ఈ పాఠశాలకు శుద్ధ జల యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొంతకాలం విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించినప్పటికీ, అనంతరం యంత్రం మరమ్మత్తులకు గురై పనిచేయకుండా పోయింది. ఈ వేసవిలో శుద్ధ జలా యంత్రం ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అమర్నాథ్, ఆ పాఠశాల కమిటీ సభ్యులు మరమ్మత్తులు చేయించారు. అయినప్పటికీ కరెంట్ లో వోల్టేజ్ ప్రభావం వల్ల పనిచేయక ఆగిపోయింది. ఇదిలా ఉండగా ఇటీవలే పీఎం శ్రీ పథకం కింద మరో శుద్ధ జల యంత్రం ఈ పాఠశాలకు వచ్చింది. రెండు శుద్ధ జల యంత్రాలు ఉండగా కరెంటు లో వోల్టేజ్ వల్ల నిరుపయోగంగా ఉండిపోయాయని సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలలో త్రాగునీటి కోసం ఇళ్ల నుంచే నీటి బాటిల్లు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో కూడా అదే నీటిని వినియోగించాల్సి వస్తుందని శుద్ధమైన తాగునీరు అందుబాటులో లేక చిన్నారులు సాధారణ తాగు నీటినే వినియోగించాల్సి వస్తుందని, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటుచేసిన శుద్ధ జల యంత్రాలు, నిర్వహణ లేక నిరుపయోగంగా మారడం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు సురక్షితమైన తాగునీరు అందించడం అత్యవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరెంట్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తల్లితండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

# హాలహర్వి లో రైతులు ధర్నా




**హాలహర్వి జూలై 07, ప్రజా జ్యోతి ఆంధ్రప్రదేశ్** ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ ఉచిత విద్యుత్ పథకం బోర్లు, బావులు ఉన్న రైతులకు మాత్రమే వర్తిస్తుంది. వివరాల్లోకి వెళితే"వార్త" దినపత్రికలో జూలై 03 తేదీ వచ్చిన వార్త కథనం ప్రచురితమైంది రైతుల అక్రమ విద్యుత్ కనెక్షన్ల కథనానికి స్పందనగా మంగళవారం హాలహర్వి మండల కేంద్రంలో ఆదోని-బళ్లారి రోడ్డుపై బాపురం, పచ్చారపల్లి, గూళ్యం, నిట్రవట్టి గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు అనుబంధ సంఘాలు, అలాగే సిపిఎం, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ పార్టీ నాయకులు మోసి, ఎల్లప్ప, హనుమంతు, బసప్ప రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ధనుంజయ్, హనుమంతప్ప మాట్లాడుతూ రైతులు ఏ అధికారులకు డబ్బులు ఇవ్వలేదని, బోరు, బావులు ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం రైతులు మీ-సేవలో చలానా కట్టి అనుమతులు తీసుకుని దరఖాస్తు చేసుకున్నారని, నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు విద్యుత్ కనెక్షన్లు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనవసర ఆరోపణలు చేసి రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఏఈ జంబన్న మాట్లాడుతూ బోరు, బావులు ఉన్న రైతులకు మాత్రమే నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, అక్రమ కనెక్షన్లు ఇచ్చినట్టు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు. ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అక్రమ విద్యుత్ కనెక్షన్లు వార్తా పత్రికలో కథనానికి స్పందనగా వార్తా విలేకరి రాసిన వార్తకు కోర్టుకు సాక్ష్యాలు చూపిస్తాడు ఆయన దగ్గర ఏమీ లేకుంటే పొరపాటు అయిందని తెలియజేస్తాడు లేకపోతే పరువు నష్టాలు దావా కింద కేసు వేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కత్తి రామాంజనేయులు, సిపిఎం కృష్ణ, మాజీ సర్పంచ్ నాగేంద్ర , వేంకటేశ్వర రెడ్డి ,రాజన్న రెడ్డి,లింగప్ప, గాదిలింగ ,బసప్ప బాపురం ,పచ్చారపల్లి, గూళ్యం, నిట్రవట్టి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బద్వేలులో అంగరంగ వైభవంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**మందకృష్ణ మాదిగ 62వ జన్మదిన వేడుకలు**

**పదో తరగతి ప్రతిభావంతులకు ఘన సన్మానం**

**మాదిగ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యర్రబల్లె ఓబయ్య ఆధ్వర్యంలో సంబరాలు**



**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ జూలై 7 (ప్రజా జ్యోతి)** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం మరియు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి 62వ పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బద్వేలు నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యర్రబల్లె ఓబయ్య గారి అధ్యక్షతన స్థానిక ఆర్డిఓ ఆఫీస్ ఎదురుగా ఈ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు ఎస్సీ వర్గీకరణ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 587 మార్కులు సాధించిన గొల్లపల్లి ప్రియాంక, 581 మార్కులు సాధించిన సోమిరెడ్డి పల్లె వర్షితలను మాదిగ బిడ్డలను ఈ వేడుకల్లో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘాల నాయకులు జాల గురయ్య, లక్కినేని సురేష్, యర్రబల్లె ఓబయ్యలు ప్రత్యేకంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దలు జాల గురయ్య మాదిగ మాట్లాడుతూ.. ప్రియాంక, వర్షితలు ఉన్నత చదువులు చదివి తమ తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మరియు మాదిగ జాతికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ దీవించారు. ఇదే వేదికపై సీనియర్ నాయకులు జాల గురయ్య గారిని ఉద్యోగులందరూ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల జాతీయ నాయకులు సిరంగి దేవానందం, డాక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య, ముండ్లపాటి పిచ్చయ్య, తలారి రత్నం, సగిలి బాలయ్య, ఓఎస్వీ ప్రసాద్, లక్కినేని సురేష్, దాసరి పల్లె సురేష్, సోమిరెడ్డి పల్లె ప్రసాద్, అనకర్ల మల్లికార్జున, సోమిరెడ్డి పల్లె జయచంద్ర, సగినాల డేవిడ్, నాగిపోగు ప్రసాద్, శ్రీనివాసులు, రామయ్య, బాలయ్య, చిన్న, దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కృషితో ముంపు గ్రామాలకు శాశ్వత విద్యుత్ పరిష్కారం

**గోదావరి 60 అడుగులు దాటినా ఇక విద్యుత్ కు అంతరాయం లేదు**
**ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు**
**కృతజ్ఞతలు తెలిపిన వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు**



**ఎటపాక, జూలై 7 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలంలోని గోదావరి ముంపు ప్రభావిత గిరిజన గ్రామాల ప్రజలకు ఎన్నో ఏళ్లుగా వెంటాడుతున్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గతంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులు దాటితే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు మునిగిపోవడంతో పది ముంపు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. దీంతో గ్రామాలు చీకట్లో మగ్గిపోవడమే కాకుండా తాగునీటి సరఫరా కూడా తీవ్రంగా దెబ్బతినేది. ఈ సమస్యను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి తోటపల్లి నుంచి మురుమూరు వరకు రూ.56 లక్షల వ్యయంతో ఎత్తైన ప్రాంతంలో నూతన విద్యుత్ లైన్ మంజూరు చేయించారు. ఇటీవల ఆమె చేతుల మీదుగా ఈ విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు. అయితే విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి అవసరమైన పెండింగ్ నిధుల కారణంగా జాప్యం ఏర్పడింది. గత నెల గోదావరి వరదలపై నిర్వహించిన ముందస్తు సమీక్ష సమావేశంలో ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పాల్గొని ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ పెండింగ్ నిధులను విడుదల చేయడంతో విద్యుత్ లైన్ ప్రారంభానికి మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే వరదల సమయంలో గోదావరి నీటిమట్టం 60 అడుగులు దాటినా ముంపు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉండదని తెలిపారు. గిరిజన గ్రామాల ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి, వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యుత్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావుకు ముంపు గ్రామాల గిరిజన ప్రజలు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

# 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై ఐటీడీపీ ట్రోల్స్ దురదృష్టకరం

- తమ్మినేని సీతారాంపై వ్యక్తిత్వ హననాన్ని ముక్తకంఠంతో ఖండించిన వైసీపీ నేతలు
- ఆముదాలవలసలో వైసీపీ నేతల మీడియా సమావేశం
- రాజకీయ వికేంద్రీకరణపై చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని మండిపాటు
- ఉత్తరాంధ్ర అభివృద్ధే తమ్మినేని లక్ష్యం
- బీసీ, బలహీన వర్గాల గొంతుకపై దుష్ప్రచారం తగదు
- సీనియర్ నాయకుడి వాక్యలను వక్రీకరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు
- తమ్మినేని ప్రతీ అభిప్రాయంలో జిల్లా అభివృద్ధి గురించి స్పష్టంగా తెలుస్తుంది
- ఐటీడీపీకి ప్రజలే బుద్ధి చెప్తారు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు
- తమ్మినేని పై చేసిన అసత్య ప్రచారాలకు టీడీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్) దుంపల రామారావు
- తమ్మినేనిని వక్రీకరించి మాట్లాడటం అత్యంత బాధాకరం
- 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని కించపరిచే కుట్రలు సరికాదు



**ఆమదాలవలస ప్రజాజ్యోతి న్యూస్:** 1982లో ప్రజా జీవితంలో అడుగుపెట్టి, ఆముదాలవలస షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం నుంచి ప్రభుత్వ విప్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో 17 శాఖలను నిర్వహించిన మంత్రిగా, అనంతరం శాసనసభాపతిగా దాదాపు నాలుగున్నర దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించిన మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాంపై ఐటీడీపీ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హనన చర్యలను వైసీపీ శ్రేణులు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ మేరకు మంగళవారం నాడు ఆమదాలవలస లో ఓ ప్రవేట్ కళ్యాణ మండపంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్) , వైసీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు (లక్ష్మణరావు) మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థిత్వం పేరుతో ఒక సీనియర్ నాయకుడి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అప్పట్లో రాజకీయ వికేంద్రీకరణకు అనుకూలంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఇప్పుడు వేరే కోణంలో చూపిస్తూ ట్రోల్స్ చేయడం బాధాకరమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన రాజకీయ వికేంద్రీకరణ విధానంలో భాగంగా విశాఖపట్నంలో పరిపాలనా రాజధాని ఏర్పాటు జరిగితే వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతోనే తమ్మినేని సీతారాం మాట్లాడారని గుర్తు చేశారు. ఒకే ప్రాంతంలో రాజధాని కేంద్రీకృతమైతే అభివృద్ధి కూడా అదే ప్రాంతానికే పరిమితమవుతుందనే రాజకీయ అవగాహనతో ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారని, దానిని ఇప్పుడు వక్రీకరించి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని అన్నారు. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనుక అప్పటి జిల్లా మంత్రిగా తమ్మినేని సీతారాం చేసిన కృషి ఎంతో ఉందన్నారు. గత నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోల్స్ రాజకీయాలను దిగజార్చేలా ఉన్నాయని విమర్శించారు. రాజధాని వికేంద్రీకరణపై సభాపతిగా తన బాధ్యతల్లో భాగంగానే తమ్మినేని మాట్లాడారని, ఆయన మాటలను వక్రీకరించి పెడార్థాలు వెతకడం సమంజసం కాదన్నారు. తమ్మినేని వ్యక్తం చేసిన ప్రతి అభిప్రాయంలోనూ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒక సీనియర్ నాయకుడి ఆవేదనను రాజకీయాల కోసం వాడుకోవడం తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. తమ్మినేని పై చేసిన అసత్య ప్రచారాలకు ట్రోలింగ్ లకు టీడీపీ తక్షణమే స్పందించి ,బహిరంగ క్షమాపణ చెప్పాలని రామారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాంపై ఐటీడీపీ సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యక్తిత్వ హననం అత్యంత బాధాకరమన్నారు. 1982లో సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా ప్రజా జీవితంలోకి వచ్చి, 2024 వరకు సభాపతిగా దాదాపు 45 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిపై ఇలాంటి ప్రచారం చేయడం ఖండనీయమన్నారు. బలహీన, గిరిజన, హరిజన, వెనుకబడిన వర్గాల గొంతుకగా తమ్మినేని నిరంతరం నిలిచారని, ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరవలేరని పేర్కొన్నారు. 45 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ఎదుర్కోలేక ప్రజా జీవితాన్ని ,వ్యక్తిత్వాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఇటువంటి దుష్ప్రచారాలు పాల్పడుతున్న వారికి ప్రజలే తగిని తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబిల్లి శ్రీనివాసరావు ,రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు ,రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ కార్యదర్శి బెశీడి గాంధీ ,మాజీ డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి బడాన కృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ముత్త విజయ్, బూర్జ ఎంపీపీ ప్రతినిధి కర్ణన నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు కోట రమణ, రాష్ట్ర వాలంటీరీ వింగ్ కార్యదర్శి పైడి రాణా ప్రతాప్, మాజీ సర్పంచులు బొడ్డేపల్లి హరి, తమ్మినేని మురళీకృష్ణ, ఉదయ్, వియ్యపు కృష్ణ, అనురాధ, చిలకలపల్లి సురేష్, కంబాపు సూర్యారావు, ఎన్ని రామచంద్రయ్య, గొంటి కృష్ణ, కొత్తకోట ఎంపీటీసీ సురవరపు సింహాచలం, బీసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కూన రాజారావు, నాయకులు సురేష్ దొర, బొడ్డేపల్లి నారాయణమూర్తి, వవిలపల్లి గోవిందరావు, బొగ్గ కుమార్, తవిటి రెడ్డి, గురుగుబిల్లి ప్రభాకర్ రావు, పేడాడ అప్పలనాయుడు, ఉప్పినివలస శ్రీను, సనపల తవుడు, తిర్లంగి రామారావు, పకీరు, సింగూరు సూర్యనారాయణ, తేజ, రాంప్రసాద్, గిరి, కొన్న సత్తిబాబు, మున్సిపాలిటీకి చెందిన గొంటి ఈశ్వరరావు, కుసుమంచి శ్యాంప్రసాద్, మెట్ట కృష్ణ, మెట్ట చక్రధర్ రావు, సనపల రామారావు, సనపల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పొందూరు లో రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యుల ఆకస్మిక తనిఖీలు







- రేషన్ దుకాణాలు , అంగన్వాడీ కేంద్రాలు , వసతి గృహాలు , ఎం.ఎల్.ఎస్ పాయింట్లలో సేవలు నాణ్యత పై పరిశీలన
- వంట పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించండి
- పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలి
- రేషన్ దుకాణాలలో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలి
- రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు బి కాంతారావు

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** రేషన్ దుకాణాలలో రికార్డులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు బి కాంతారావు అన్నారు. పొందూరు మండల కేంద్రంలో మంగళవారం నాడు రేషన్ దుకాణాలు ,రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు వసతి గృహాలు,ఎం.ఎల్.ఎస్ పాయింట్లు లను ఆయన సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ పౌర సరఫరా వ్యవస్థ పనితీరు రేషన్ సరుకుల పంపిణీ విధానం పై ఆరా తీశారు. ఉన్నత పాఠశాలలు వసతి గృహాలలో సరుకుల నిల్వలు రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలు మౌలిక వసతులు పై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి , పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని వంటగది పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పోషకరమైన ఆహారం అందించేలా చూడాలని మండల విద్యాశాఖ అధికారులు ఏం.వాగ్దేవి పట్నాన రాజారావు లను ఆదేశించారు. అనంతరం పొందూరు పట్టణంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి ,రికార్డులను,స్టాకు వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాస్ సరఫరాలో డెలివరీ బాయ్స్ అవకతవకలకు పాల్పడుతున్నారని బ్లాక్ మార్కెట్ లకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు కాంతారావు కు పిర్యాదు చేశారు. దీనిపై సివిల్ సప్లై డి.టి సింహాచలం తో ఆయన మాట్లాడి ఏ విధమైన చర్యలు తీసుకున్నారని ఎన్ని కేసులు నమోదు చేశారని ప్రశ్నించారు. అనంతరం పొందూరు కస్పా వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సన్నబియ్యం కాకుండా రేషన్ బియ్యం సరఫరా కావడం పై ఆశ్చర్యం వ్యక్తం చేసిన కాంతారావు అంగన్వాడీ కేంద్రాలకు ఏం.డి.ఏం మాదిరిగా సన్నబియ్యం సరఫరా అయ్యేలా ప్రభుత్వం తో మాట్లాడతానన్నారు. ఈయనతో పాటు డి.ఎస్.ఓ సూర్యప్రకాష్ రావు ఐ.సి.డి.ఎస్ పీడీ సువర్ణ ,సిబ్బంది పాల్గొన్నారు

## ఎర్రకోటలో వానల కోసం వరుణదేవుడికి రైతుల ప్రత్యేక పూజలు



**ఎమ్మిగనూరు జులై 06 (ప్రజా జ్యోతి ):** మండలం ఎర్రకోట గ్రామంలో గ్రామస్తులు, రైతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ఋతుపవనాలు ప్రవేశించినప్పటికీ, కర్నూలు జిల్లాలో ఆశించిన మేర వరాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.వానల కోసం ఎదురుచూస్తూ రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. వర్షాధారిత పంటలపై ఆధారపడే చాలా మంది రైతులు విత్తనాలు వేసేందుకు సరైన వర్షం కోసం వేచి చూస్తుండగా,ఇప్పటికే వచ్చిన అరకొర వర్షాలకు విత్తనాలు వేసిన కొంతమంది రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. తగినంత తేమ లేక విత్తిన విత్తనాలు మొలకెత్తినప్పటికీ,ఆ చిగురుటాకులు కళ్ల ముందే వాడిపోతుండటంతో రైతులు విలవిలలాడుతున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రకృతిని నమ్ముకున్న ఎర్రకోట గ్రామస్తులు,వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు ఆధ్యాత్మిక మార్గాన్ని ఆశ్రయించారు.గ్రామ యువకులు, పెద్దలు కలిసి పవిత్రమైన పురాతన బావి నుండి 101 బిందెలతో నీటిని తోడారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ, 'ఓం నమః శివాయ' నామస్మరణతో గ్రామంలో ఉన్న మొత్తం 18 దేవాలయాలకు ఆ జలాలను తీసుకెళ్లారు. ఆయా ఆలయాల్లోని శివలింగాలకు అత్యంత భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించి, త్వరగా వర్షాలు కురిపించాలని కోరుకుంటున్నారు. ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు వరుణ దేవుడిని వేడుకున్నారు. పంటల సాగు కోసం రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావని, వర్షాలు కురిసి భూమి తడిస్తేనే తమ బతుకులు బాగుపడతాయని ఎర్రకోట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారి పండుగ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం



**ప్రజాజ్యోతిరిపోర్టర్ :- యం. నరేష్. శ్రీకాకుళం** పాతపట్నం మండలం కాగువాడ గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు కి ఘన స్వాగతం పలికారు.. గ్రామస్తుల ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొంది, ప్రజలందరు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు...జిల్లా అధ్యక్షులకు గ్రామస్తులు దుస్సాలువాతో ఘనంగా యస్సివీధి ప్రజలు సత్కరించారు.... జిల్లా అధ్యక్షులతో పాటు పాతపట్నం మండల అధ్యక్షుడు పడాల షణ్ముఖరావు, పైల భాస్కరరావు , కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గున్నారు....

## నిజమైన దివ్యాంగులకు న్యాయం జరిగేలా సదరం స్లాట్‌లను కొనసాగించాలి

**-జూలై 8వ తేదీ ఉదయం 6:00 గంటల నుండి సదరం స్లాట్‌లు ప్రారంభం కానున్నాయి.**
**-ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగిమల్ల రంగారెడ్డి.**



**రాయచోటి జూలై 07 ప్రజా జ్యోతి** జూలై 8వ తేదీ అనగా బుధవారం ఉదయం 6:00 గంటల నుండి సదరం స్లాట్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు మరియు పాలకులకు మా వినమ్ర విజ్ఞప్తి ఏమనగా, నిజమైన దివ్యాంగులకు న్యాయం జరిగే విధంగా సదరం స్లాట్‌లను అందుబాటులో ఉంచి, జిల్లా వారీగా ఆయా జిల్లాల అభ్యర్థులకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ఇతర జిల్లాలకు స్లాట్‌లు మళ్లించకుండా పారదర్శకంగా బుకింగ్ జరిగే విధంగా వ్యవస్థను కొనసాగించాలని కోరుతున్నాము.అలాగే, సాటి దివ్యాంగ సోదర, సోదరీమణులందరికి మా విజ్ఞప్తి ఏమనగా బుధవారం ఉదయం 6:00 గంటల నుంచే సదరం బుకింగ్ ప్రారంభమవుతుంది. కాబట్టి మీ గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి వీలైనంత త్వరగా మీ సదరం స్లాట్‌ను బుక్ చేసుకోవాలని మనవి చేస్తున్నాము.నిజమైన అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం సేవలు అందేలా మనమందరం కలిసి కృషి చేద్దాం.

## బద్వేల్‌లో మహబ్బత్ చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 7 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణం స్థానిక ఎస్.బి.వి.ఆర్. కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో 'మహబ్బత్' చలనచిత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బద్వేల్ మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె తన చేతుల మీదుగా చిత్ర అధికారిక పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం విజయమ్మ మాట్లాడుతూ చిత్ర యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మరియు చిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## జననేత వైఎస్సార్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధం!

**నేడు తోటపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా పాలాభిషేకం**

**భారీగా తరలిరావాలని వైకాపా మండల కమిటీ పిలుపు**



**ఎటపాక, జూలై 7 (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటపాక మండలం తోటపల్లి గ్రామంలో బుధవారం (జూలై 8) ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రత్యేక పాలాభిషేక కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన పథకాలు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయి.. పేదల పెన్నిధి, సంక్షేమ రథసారథి వైఎస్సార్ జనహృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని నాయకులు కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి పథకాలు కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తుచేశారు. మహానేత అందించిన నిరుపమాన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సంస్మరణ కార్యక్రమానికి ఎటపాక మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి, జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వైకాపా మండల కమిటీ సాదరంగా ఆహ్వానించింది.

## మంత్రివర్యులు మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం.

**మన ఓటు మన హక్కు లేనియెడల మన ఉనికికే ప్రమాదం**

**గాజుల ఖాదర్ బాషా**

**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు**



**రాయచోటి జూలై 07 ప్రజా జ్యోతి** మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మంత్రి గారి తమ్ముడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మరియు మౌర్య రెడ్డి గారి సూచనల మేరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నాయబ్ సాబ్ వీధిలో నిర్వహించడం జరిగిందని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు..

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**

చాలామంది ఓటర్ వెరిఫికేషన్ ఫారం తీసుకున్న వారు త్వరితగతిన పూర్తి చేసి బిఎల్ఓ గారికి అందజేయాలని సమయము చాలా తక్కువగా ఉన్నదని తెలిపారు చనిపోయిన వారి వివరాలు కూడా తెలపాలని చనిపోయిన వారి ఓట్లు తీసివేయాలని మరియు డబల్ ఎంట్రీ ఓట్లు కూడా తీసివేయాలని బిఎల్ఓ లకు గాజుల ఖాదర్ బాషా తెలిపారు ఇప్పుడు కూడా చాలామంది భయపడుతున్నారని ఓటు తీసేస్తారని భయము చాలామందిలో నెలకొన్నదని అటువంటి ఏమీ లేదని భయపడనవసరం లేదని మన ఓటును మనం ధ్రువీకరించవలెను సంబంధిత బి ఎల్ఓ వద్దకు వెళ్లి ఏమైనా అనుమానం ఉంటే కూడా తెలుసుకొని త్వరితగతిన అందజేయాలని తెలిపారు గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఓటు హక్కు మన ఆయుధమని ప్రతి ఒక్కరూ తమ ఓటును ధ్రువీకరించుకోవాలని తెలిపారు నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అజ్మల్ ఆసిఫ్ ఫెరోస్ బి ఎల్ వోలు యుగంధర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులు.

**కోవెలకుంట్ల :జులై=07 ప్రజాజ్యోతి** (పిఒసియస్ఒ) మరియు దాడి కేసులో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్షరూ.20,000/- జరిమానా కొయిలకుంట్ల పోలీసు స్టేషన్ క్రైమ్ నెం56/2022 యు/యస్ఇసి 354(ఎ), 354(డి), 307 ఆర్/డబ్ల్యు 34 ఐపియస్, యస్ఇసి 12 అఫ్ పిఒసియస్ ఒయాక్ట్ ఫిర్యాదుదారు: ప్రతిమ శేఖర్, వయస్సు 42 సంవత్సరాలు, తండ్రి: ప్రతిమ త్యాగరాజు, కంపమల్ల గ్రామం, కొయిలకుంట్ల మండలం.

**ముద్దాయిలు:**

1. గోపిరెడ్డి మయుడు (ఎ1) -- (మరణించినందున కేసు అబౌట్ )
2. గోపిరెడ్డి బాబు (ఎ2), వయస్సు 41 సంవత్సరాలు, కంపమల్ల గ్రామం, కొయిలకుంట్ల మండలం.

**కేసు వివరాలు:**

27-03-2022 తేదీన సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో కొయిలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో మైనర్ బాలికను ముద్దాయిలు లైంగిక ఉద్దేశ్యంతో వేధిస్తూ ఆమె చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఘటనను అడ్డుకునేందుకు వచ్చిన బాలిక తాత శ్రీ ప్రతిమ త్యాగరాజుపై కర్రలతో తల మరియు భుజాలపై దాడి చేసి గాయపరిచారు.ఈ ఘటనపై 28-03-2022 తేదీన కొయిలకుంట్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి షేక్ మౌలని కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టులో ప్రభుత్వ ప్రత్యేక అభియోగ వాది సి వి శ్రీనివాసులు సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కర్నూలు పోక్సో (పిఒసియస్ఒ) చట్టం కింద బాలలపై లైంగిక నేరాల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం, కర్నూలు 07.07.2026 న తీర్పు వెలువరించారు.విచారణలో నేరం రుజువైనందున ముద్దాయి ఎ2 గోపిరెడ్డి బాబును పిఒసియస్ఒ చట్టం సెక్షన్ 11 ఆర్/డబ్ల్యు 12 క్రింద ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష మరియు రూ.10,000/- జరిమాన, అలాగే ఐపిఎస్ సెక్షన్ 324 ఆర్ /డబ్ల్యు 34 కింద ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్ష మరియు రూ.10,000/- జరిమానగా న్యాయస్థానం ఆదేశించింది., ఎ1 మరణించినందున అతనిపై కేసు ముగిసినట్లు (అబౌట్) నమోదు చేశారు.పిఒసియస్ఒచట్టం కింద విధించిన రూ.10,000/- జరిమానాను బాధిత బాలికకు, ఐపిసి సెక్షన్ 324 కేసులో విధించిన రూ.10,000/- జరిమానాను గాయపడిన బాధితుడికి పరిహారంగా చెల్లించాలని గౌరవ న్యాయస్థానం ఆదేశించింది.సదరు కేసుపై నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఐపిఎస్ గారి ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డియస్పి ఎ. శ్రీనివాసరావు గారి ఆధ్వర్యములో ప్రస్తుతం ఉన్న కోవెలకుంట్ల సిఐ పి. హనుమంతు నాయక్ మరియు కోవెలకుంట్ల యస్ ఐ పి. మల్లికార్జున రెడ్డి మరియు కోర్టు కానిస్టేబుల్ పిసి -3255 ఎం. శ్రీనివాసులు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచడం జరిగింది. కోర్టు ప్రభుత్వ ప్రత్యేక అభియోగ వాది సివి. శ్రీనివాసులు తమ వాదనలు వినిపించగా కర్నూలు పోక్సో (పిఒసియస్ఒ) చట్టం కింద బాలలపై లైంగిక నేరాల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం, కర్నూలు ఎస్ పిఎల్ . జుడీషన్ పర్ పిఒసియస్ ఒ క్రాసెస్ కర్నూల్ ఇ. రాజేంద్ర బాబు విచారణ అనంతరం నేరం రుజువైనందున ఎ2 గోపిరెడ్డి బాబును పిఒసియస్ ఒ చట్టం సెక్షన్ 11 ఆర్ /డబ్ల్యు12 క్రింద మరియు రూ.10,000/- జరిమాన, అలాగే ఐపిసి సెక్షన్ 324 ఆర్ /డబ్ల్యు34 కింద ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్ష రూ.10,000/- జరిమానా గా న్యాయస్థానం ఆదేశించింది., ఎ1 మరణించినందున అతనిపై కేసు ముగిసినట్లు (అబౌటెడ్) గా నమోదు చేసి తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ కేసులో నిందితుడిపై సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించి శిక్ష పడేలా కృషి చేసిన కొయిలకుంట్ల ఎస్ ఐ పి.మల్లికార్జున రెడ్డి మరియు కోర్ట్ పి సి యం.శ్రీనివాసులు, ప్రభుత్వ ప్రత్యేక అభియోగ వాది సి వి శ్రీనివాసులు, దర్యాప్తుకు సహకరించిన పోలీసు సిబ్బందిని నంద్యాల జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.07.2026

# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.నిశాంత్ కుమార్



**లక్కిరెడ్డిపల్లి ప్రజా జ్యోతి ,7 జూలై** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం లక్కిరెడ్డిపల్లి మండలంలోని కోనంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్ నెం. 8తో పాటు లక్కిరెడ్డిపల్లి టౌన్‌లోని పోలింగ్ స్టేషన్ నెం. 18ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న తీరు, హౌస్‌హోల్డ్ ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, వాటి ప్రదర్శన, నమోదు ప్రక్రియలను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించ బడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను సమగ్రంగా నమోదు చేయడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన పేర్లు చేర్చడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలు, మరణించిన ఓటర్ల సమాచారాన్ని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు.సేకరించిన సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేసి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఓటరు జాబితా ఖచ్చితత్వమే ఎన్నికల పారదర్శకతకు పునాదిగా నిలుస్తుందని పేర్కొంటూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ గడువులోగా అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఒవైసీ విద్యా సంస్థలపై రాజకీయ రంగు



**హైదరాబాద్ :** తెలంగాణలో ఓవైసీల నేతృత్వంలోని ఫాతిమా విద్యాసంస్థల భూముల వ్యవహారం మరోసారి రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కోర్టుల అక్షింతలు, అధికార-విపక్షాల మధ్య సవాల్-ప్రతిసవాళ్లతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, ఈ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య పదునైన విమర్శల యుద్ధానికి దారితీసింది.ఫాతిమా విద్యాసంస్థల ఉల్లంఘనలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు కోర్టుకు సమర్పించిన నివేదికలు, చెప్పిన సమాధానాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాము ఈ సంస్థలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని హైకోర్టుకు స్పష్టం చేసింది. తాము ప్రస్తుతం సర్వే వ్యవహారాల్లో బిజీగా ఉన్నామంటూ కాలయాపన సమాధానం ఇచ్చింది. నివేదిక ఇచ్చేందుకు కొంత గడువు కావాలని కోరింది. చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఇతర శాఖల నుంచి స్పష్టమైన నివేదికలు వస్తేనే తాము తదుపరి చర్యలు తీసుకోగలమని వివరించింది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ, బాధ్యతల నుంచి తప్పుకునేలా ఉన్న ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఇన్నిసార్లు చీవాట్లు పెడుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని న్యాయస్థానం నిలదీసింది.హైకోర్టు వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచాయి. ముఖ్యంగా బీజేపీ ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు నడుపుతామని చెప్తున్న హైడ్రా, ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది.కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ వివాదంపై అత్యంత ఘాటుగా స్పందించారు. తాము అధికారంలోకి వస్తే ఓవైసీ విద్యాసంస్థలను కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి.దీనికి ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. "ఒక విద్యాసంస్థను కూల్చితే.. వంద విద్యాసంస్థలను కడతాం" అంటూ సవాల్ విసిరారు. తమ విద్యాసంస్థలను, మైనారిటీల హక్కులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసంటూ ఆయన స్పష్టం చేశారుఅక్బరుద్దీన్ ఓవైసీ కామెంట్స్ పై మరో కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓవైసీ సోదరులు బహిరంగంగా ప్రభుత్వాన్ని, చట్టాన్ని బెదిరిస్తున్నా రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ అంటే రేవంత్ రెడ్డికి అంత భయమా అని నిలదీశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కేవలం ఒక భూ వివాదంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. ఒకవైపు హైడ్రా యాక్షన్‌తో దూసుకుపోతున్నట్లు కనిపిస్తున్నా, ఎంఐఎం నేతలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రం వెనకడుగు వేస్తోందనే ఇంప్రెషన్ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విభాగాలు కోర్టులో పొంతన లేని సమాధానాలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ గ్యాప్‌ను వాడుకుని తెలంగాణలో తామే ప్రధాన ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కోర్టు తదుపరి ఆదేశాలు ఎలా ఉండబోతున్నాయి? హైడ్రా నిజంగానే చర్యలకు ఉపక్రమిస్తుందా? లేదా ప్రభుత్వ శాఖల మధ్య ఫైళ్ల కదలికల పేరుతో కాలయాపన జరుగుతుందా? అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# 70 ఏళ్ల జీ హెచ్ ఎంసీ చట్టానికి ఫుల్ స్టాప్




**హైదరాబాద్ :** తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 70ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి చెప్పబోతోంది. మూడు కార్పొరేషన్లు (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) కలిపి కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది. ఈ మేరకు క్యూర్ ముసాయిదా బిల్లు (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) -2026ను ఆదివారం విడుదల చేసింది. ఈ బిల్లులో 43 చాప్టర్లు, తొమ్మిది షెడ్యూళ్లు ఉన్నాయి. జూలై 24 వ తేదీ వరకు ప్రజాభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ ప్రకటించింది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) 2026 ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ పరిధిలోని ఆస్తి యాజమానులపై పన్నుభారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా, ఆస్తి మూలధన విలువ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ ను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాక.. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువను ఆధారంగా తీసుకొని స్థలాలు, భవనాలపై ఆస్తిపన్ను విధించనున్నారు. దీంతో ముఖ్యంగా పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనేక ఆస్తులపై పన్ను గణనీయంగా పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలకు పన్ను పెంపును దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించే భవనాలకు కొత్త విధానం వెంటనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోందక్యూర్ ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే.. క్యూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా.. అందులో ఎవరైనా నివాసం ఉండే పరిస్థితి ఉన్నా.. కమిషనర్లు 24 గంటల ముందు నోటీసులు ఇచ్చి సీజ్ చేయొచ్చు. ఒకవేళ ప్రజల భద్రతకు ఇబ్బందిగా ఉంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సీజ్ చేసే అవకాశం ఉంటుంది. క్యూర్ చట్టంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే ప్లాట్ మూలధన విలువలో 0.25శాతం మేర జరిమానా విధిస్తారు. చెత్త తొలగించే వరకు జరిమానాల విధింపు ఉంటుంది. ఈ విధానం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.క్యూర్ చట్టం ముసాయిదాలో ఆహార భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త చట్టంలో అధ్యాయం-33లో ఆహార భద్రత, పోషకాహారం అంశాలను చేర్చారు. దీని ప్రకారం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కన్వీనర్‌గా 'ఆహార భద్రత, పోషకాహార కమిటీ' ఏర్పాటు చేస్తారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పర్యావరణం పరిరక్షణకూ ఈ క్యూర్ బిల్లులో ప్రాధాన్యత ఇచ్చారు. విపత్తుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా విపత్తు తలెత్తితే ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయడానికి క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. అంతేకాక హైడ్రాకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో అప్పగించనున్నారు.క్యూర్ బిల్లులో సెక్షన్ -168 ప్రకారం.. అనుమతిలేని ఆస్తులు, అక్రమ నిర్మాణాల క్రయ విక్రయాలు, బదిలీలు నిషేధం, అనధికార నిర్మాణాల యాజమానులకు సంబంధిత అధికారి నోటీస్ జారీ చేసి నిషేధిత జాబితాలో చేర్చుతారు. ఈ నూతన బిల్లు ద్వారా నైట్ ఎకానమీకి ప్రోత్సాహం అందించే కీలక ప్రతిపాదన చేశారు. పలు ప్రాంతాలను నైట్ ఎకానమీ జోన్లుగా ప్రకటించి రాత్రంతా వ్యాపారాలకు అనుమతి ఇవ్వనున్నారు. క్యూర్‌లోని ప్రజలకు అన్ని అత్యవసర సేవలకు ఒకే ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెస్తారు.క్యూర్ బిల్లును ప్రజా సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరులు తమ అభిప్రాయాలు, సూచనలను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని పేర్కొంది. మూడు కార్పొరేషన్ల వెబ్ సైట్లలో ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. రాతపూర్వ కంగా కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, సచివాలయం, హైదరాబాద్‌కు తమ సూచనలను పంపొచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే, ఈ సూచనలు, అభ్యంతరాలను కేవలం జులై 24వ తేదీ వరకు మాత్రమే స్వీకరించటం జరుగుతుందని ప్రభుత్వం ష్టం చేసింది.

బిజినెస్

## ఎగువ మధ్యాదాయ రేసులో 5 రాష్ట్రాలు!



భారతదేశం స్థూలంగా తక్కువ మధ్య ఆదాయ (లోయర్ మిడిల్ ఇన్‌కమ్) ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నప్పటికీ దేశీయంగా కొన్ని రాష్ట్రాలు మాత్రం ఆదాయంలో దూసుకుపోతున్నాయి. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన దేశాల ఆర్థిక వర్గీకరణ గుర్తింపు, రాష్ట్రాల తలసరి ఆదాయ డేటాను విశ్లేషిస్తూ కొన్ని సంస్థలు అందించిన నివేదిక ప్రకారం.. భారతదేశంలోని ఐదు రాష్ట్రాలు ఇప్పటికే ప్రపంచ బ్యాంకు ఎగువ మధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కమ్) పరిమితిని దాటేశాయి. మరోవైపు కొన్ని రాష్ట్రాలు ఈ మైలురాయికి అత్యంత సమీపంలో ఉండగా మరికొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ పేదరికంలో వెనుకబడి ఉండటం దేశీయ ఆర్థిక అసమానతలను స్పష్టం చేస్తోంది.ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం, ఏ దేశం లేదా ప్రాంతం తలసరి ఆదాయమైనా 4,636 డాలర్ల నుంచి 14,375 డాలర్ల మధ్య ఉంటే దానిని 'ఎగువ-మధ్య-ఆదాయ' ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తారు. ఈ బెంచ్‌మార్క్‌ను అధిగమించి టాప్-5లో నిలిచిన భారతీయ రాష్ట్రాల వివరాలు..

| స్థానం | రాష్ట్రం / కేంద్రపాలిత ప్రాంతం | తలసరి ఆదాయం (డాలర్లలో) |
|---|---|---|
| 1 | ఢిల్లీ | 6,217 |
| 2 | కర్ణాటక | 5,579 |
| 3 | తెలంగాణ | 5,407 |
| 4 | తమిళనాడు | 5,329 |
| 5 | గుజరాత్ | 4,734 |

**అడుగు దూరంలో మరిన్ని రాష్ట్రాలు**

మరికొద్దిపాటి వృద్ధిని నమోదు చేస్తే 'ఎగువ-మధ్య-ఆదాయ' హోదాను అందుకోవడానికి మరో మూడు రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నాయి. అందులో.. మహారాష్ట్ర: తలసరి ఆదాయం 4,628 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 8 డాలర్లు తక్కువ). హరియాణా: తలసరి ఆదాయం 4,627 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 9 డాలర్లు తక్కువ). కేరళ: తలసరి ఆదాయం 4,610 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 26 డాలర్లు తక్కువ).

ఒకవైపు కొన్ని రాష్ట్రాలు అంతర్జాతీయ ప్రమాణాల వైపు దూసుకుపోతుంటే, మరోవైపు దేశంలో ప్రాంతీయ అసమానతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాల పరిస్థితి దయనీయంగా ఉంది. అందులో అట్టడుగున బిహార్ ఉంది. కేవలం 984 డాలర్లు తలసరి ఆదాయంతో బిహార్ భారతదేశంలోనే పేద రాష్ట్రంగా మిగిలిపోయింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ (1,403 డాలర్లు), ఝార్ఖండ్ (1,470 డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# కిలో రూ. 2 లక్షలు పలికే పుట్టగొడుగు

## ఇంట్లోనే సాగు చేస్తూ కోట్లు సంపాదిస్తున్న రైతులు!



అంతర్జాతీయ మార్కెట్లో కిలో రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు పలికే అత్యంత ఖరీదైన కీడా జడి లేదా హిమాలయన్ గోల్డ్ పుట్టగొడుగుల ఇండోర్ సాగు భారత్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. గతంలో కేవలం హిమాలయాల మంచు ప్రాంతాల్లో మాత్రమే సహజంగా దొరికే ఈ ఔషధ పుట్టగొడుగును, ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో ఒక చిన్న మూసివున్న గదిలోనే ఆర్టిఫిషియల్ ఎన్విరాన్మెంట్ సృష్టించి విజయవంతంగా పండిస్తున్నారు. ల్యాబ్ వాతావరణంలో ఉష్ణోగ్రత, తేమను కంట్రోల్ చేస్తూ ప్లాస్టిక్ లేదా గాజు జార్లలో పోషకాల ఆధారంగా దీనిని పెంచుతారు. సహజంగా ఇది చైనా, టిబెట్, భారతదేశంలోని హిమాలయ పర్వత ప్రాంతాలలో 3,500 నుండి 5,000 మీటర్ల ఎత్తులో, మంచు కరిగే సమయంలో లభిస్తుంది. ఒక రకమైన గొంగళి పురుగు తల భాగం నుండి ఈ ఫంగస్ లేదా పుట్టగొడుగు మొలుస్తుంది. అందుకే దీనికి కీడా జడి అనే పేరు వచ్చింది. దీనికి అంతటి భారీ ధర ఉండటానికి కారణం దీనిలోని అద్భుతమైన ఔషధ గుణాలే. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలకు సంబంధించిన జీవనరక్షక మందుల తయారీలో దీనిని వాడతారు. అలాగే, అథ్లెట్లు, హెల్త్ ఫ్రీక్స్ తమ శారీరక శక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఎనర్జీ బూస్టర్ సప్లిమెంట్స్ రూపంలో దీనిని విరివిగా ఉపయోగిస్తారు.

**ల్యాబ్‌లో లేదా గదిలో దీనిని ఎలా సాగు చేయవచ్చు?:**

ఒకప్పుడు కేవలం కొండల్లో మాత్రమే దొరికే ఈ పుట్టగొడుగును, ఇప్పుడు ఆధునిక కార్డిసెప్స్ మిలిటారిస్ సాంకేతికత ద్వారా ఇంట్లోనే ఆర్టిఫిషియల్ ల్యాబ్ ఏర్పాటు చేసి పండిస్తున్నారు. దీని సాగుకు ఒక చిన్న గదిని ల్యాబ్‌లా మార్చాలి. ఇందులో ఏసీ, హ్యూమిడిఫైయర్ల సహాయంతో పర్వత ప్రాంతాల్లో ఉండే శీతల వాతావరణాన్ని నిరంతరం మెయింటైన్ చేయాలి. గాజు లేదా ప్లాస్టిక్ జార్లలో బియ్యం లేదా ప్రత్యేక పోషకాలతో కూడిన ద్రవాన్ని బేస్‌గా తయారు చేసి, అందులో ఈ పుట్టగొడుగుల బీజాలను వేస్తారు. ల్యాబ్‌ను పూర్తిగా క్లీన్‌గా, శానిటైజ్డ్ వాతావరణంలో ఉంచితే దాదాపు 2 నుండి 3 నెలల వ్యవధిలోనే ఈ అత్యంత విలువైన పుట్టగొడుగుల పంట చేతికి వస్తుంది.

**పెట్టుబడి, లాభాలు:**

మొదట్లో ఈ ల్యాబ్ సెటప్, అవసరమైన యంత్రాలు, శిక్షణ కోసం దాదాపు రూ. 7 నుండి 8 లక్షల వరకు పెట్టుబడి అవసరమవుతుంది. అయితే మొదటి పంట విజయవంతంగా చేతికి వచ్చిన తర్వాత, అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ ఆధారంగా ఏడాదికి లక్షల నుండి కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం చాలా సులువవుతుంది. సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే, తక్కువ స్థలంలో అత్యధిక లాభాలను తెచ్చిపెట్టే ప్రీమియం అగ్రి-బిజినెస్‌లలో కీడా జడి సాగు అగ్రస్థానంలో నిలుస్తోంది.

# ట్రిలియనీర్ హోదా కోల్పోయిన ఎలాన్ మస్క్

## 1.4 ట్రిలియన్ డాలర్స్ నుంచి 992-997 బిలియన్ డాలర్లకు సంపద..!

ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన ట్రిలియనీర్ హోదాను కోల్పోయాడు. ప్రపంచంలోనే ట్రిలియనీర్ హోదాను దక్కించుకొన్న మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందిన మస్క్ సంపద.. ఇటీవలి కాలంలో భారీగా తరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేర్ల ధరలు పడిపోవడంతో ఆయన సంపద తగ్గింది. దాంతో ట్రిలియనీర్ హోదాను కోల్పోయారు. జూలై ప్రారంభంలో స్పేస్ ఎక్స్ షేర్ల ధరలు 30 శాతం పడిపోయాయి. దాంతో అప్పటివరకు 1.4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న మస్క్ సంపద 992-997 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ షేర్లు స్టాక్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు క్రేజ్ ఉండగా ఇప్పుడు తగ్గుతోంది. కృత్రిమ మేధస్సు రంగంలో లక్ష్యాలను సాధించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ బాండ్లను విక్రయించనున్నట్లు మస్క్ ప్రకటించడంతో మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా స్పేస్‌ఎక్స్ షేర్ ధర వరుస సెషన్లలో భారీగా క్షీణించింది. గరిష్ఠస్థాయిలో ఉన్న షేర్ మళ్లీ 150 డాలర్ల పరిధికి పడిపోయి లిస్టింగ్ ధర దగ్గరికి చేరుకుంది. ఇదే సమయంలో జూన్ 23న టెస్లా షేర్ కూడా ఒకే రోజులో 6 శాతం వరకు క్షీణించింది. టెస్లాలో కూడా మస్క్‌కు భారీ వాటా ఉండటంతో ఆయన సంపదపై ప్రత్యక్ష ప్రభావం పడింది.



# టీమిండియాపై ఇంగ్లండ్ భారీ విజయం




నేడు ఇంగ్లండ్‌కు భారత్‌కు మధ్య జరిగిన మూడో టి20లో టీమిండియాపై 125 పరుగుల తేడాతో ఇంగ్లండ్ భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మరో ఓపెనర్ జోస్ బట్లర్ (21 బంతుల్లో 36) పర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 43 పరుగులో జోడించారు. ఆ తర్వాత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో ఇంగ్లండ్ స్కోరు మందగించింది. ఒక దశలో 160 నుంచి 170 పరుగులకు పరిమితమవుతుందనుకున్న ఇంగ్లండ్.. చివర్లో సామ్ కరన్ (24 బంతుల్లో 41 నాటౌట్), విల్ జాక్స్ (7 బంతుల్లో 14) మెరుపులతో 200 పరుగుల మార్క్‌ను దాటింది. భారత బౌలర్లలో హర్షిత్ రానా, ప్రిన్స్ యాదవ్ చెరో 2 వికెట్లు తీయగా, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం 202 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన టీమిండియా వరుస వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ బౌలర్ల దాటికి భారత బ్యాట్స్‌మెన్స్ వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. జోష్ టంగ్ నాలుగు వికెట్లు, జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు తీయగా, ఆదిల్ రషీద్ రెండు, విల్ జాక్స్ ఒక వికెట్టు తీశారు. కేవలం 11.4 ఓవర్లలో 76 పరుగులకే టీమిండియా ఆలౌటైంది. భారత బ్యాట్స్‌మెన్స్‌లో వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ఇద్దరూ చెరో 13 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు.

ఇంగ్లండ్ ఇచ్చిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 11.4 ఓవర్లలో 76 రన్స్‌కే కుప్పకూలింది. జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) పేస్ ధాటికి టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు అభిషేక్ (10), సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ (13), కెప్టెన్ అయ్యర్ (5), అక్షర్ (10), తిలక్ (3), శివం దూబే (2) పెవిలియన్‌కు క్యూకట్టడంతో జట్టుకు ఘోర పరాభవంతప్పలేదు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ 20 ఓవర్లకు 201/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), ఆల్‌రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), జోస్ బట్లర్ (36) మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లలో ప్రిన్స్, హర్షిత్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 గురువారం జరుగుతుంది.

### ఆతిథ్య అమెరికాకు ఓటమి..

### క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన బెల్జియం

**సియాటెల్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆతిథ్య జట్ల పోరు ముగిసింది. టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న అమెరికా .. రౌండ్16 మ్యాచ్‌లో ఓటమి పాలైంది. బెల్జియం 4-1 గోల్స్ తేడాతో అమెరికాను ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. బెల్జియం ప్లేయర్ చార్లెస్ డీ కెటిలేర్ రెండో గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అమెరికా డిఫెన్స్ బలహీనత బయటపడింది. బెల్జియం దూకుడును ఏమాత్రం అమెరికా డిఫెండర్లు అడ్డుకోలేకపోయారు. అమెరికా ఫార్వర్డ్ ప్లేయర్ ఫొలారిన్ బలోగన్ ఈ మ్యాచ్‌లో ఆడాడు. ట్రంప్ జోక్యంతో అతనిపై ఓ మ్యాచ్ సస్పెన్షన్‌ను ఫిఫా రద్దు చేసిన విషయం తెలిసిందే. వివాదాస్పద రీతిలో బలోగన్‌ను ఆడించారు. అయినా కానీ అమెరికాకు ఆ అంశం కలిసిరాలేదు. బెల్జియం తరపున డీ కెలిటేరి 9, 33 నిమిషాల్లో, వానకేన్ 57వ నిమిషంలో, లుకాకు 93వ నిమిషంలో గోల్ చేశాడు. ఇక అమెరికా తరపున




టిల్‌మాన్ 31వ నిమిషంలో గోల్ చేశాడు. బెల్జియంతో మ్యాచ్‌లో మరీ పేలవంగా అమెరికా ఆడినట్లు ఫుట్‌బాల్ నిపుణులు చెబుతున్నారు. ఇక ఈ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన మెక్సికో, కెనడా, అమెరికా దేశాలు ఈ టోర్నీ నుంచి ఔటయ్యాయి.

స్పోర్ట్స్

### సంజూ శాంసన్‌కు మరో షాక్?




టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్‌కు మరో షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జింబాబ్వే టూర్‌కు దూరమైన అతను.. ఏషియన్ గేమ్స్ జట్టులోనూ స్థానంలో కోల్పోనున్నట్లు క్రీడా వర్గాలు అంటున్నాయి. గత నెలలో భారత సెలెక్టర్లు 15 మంది సభ్యుల ఏషియన్ గేమ్స్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో సంజూ శాంసన్ కూడా ఉన్నాడు. ప్రస్తుతం ఈ జట్టు నుంచి కూడా సంజూను తప్పించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు సమాచారం. యువ ఆటగాళ్లకు అవకాశాల పేరుతో సంజూ టీ20 కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని కొందరు బీసీసీఐ పెద్దలు యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ విషయంలో బీసీసీఐపై భారీ ఒత్తిడి ఉందని, అతడికి అవకాశాలు ఇవ్వడం కోసమే సంజూను శాశ్వతంగా తప్పించే ప్లాన్ జరుగుతుందని అతని అభిమానులు అనుకుంటున్నారు. కాగా, ఐర్లాండ్ సిరీస్, ఆతర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టీ20ల్లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్‌ను జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేయని విషయం తెలిసిందే. విశ్రాంతి పేరుతో సెలెక్టర్లు అతన్ని తప్పించారన్న ప్రచారం జరుగుతుంది. ఈ సిరీస్‌కు సంజూ స్థానంలో యువ వికెట్‌కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఇంగ్లండ్ పర్యటన తర్వాత భారత జట్టు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఏషియన్ గేమ్స్ విషయానికొస్తే.. ఈ ఖండాంతరం క్రీడలు సెప్టెంబర్ 19- అక్టోబర్ 4 మధ్యలో జరుగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (సి), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (విసి), ఇషాన్ కిషన్ (డబ్ల్యుకె), శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (విసి) ఏషియన్ గేమ్స్‌కు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (సి), తిలక్ వర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, జస్ప్రీత్ బుమ్రా, సంజు శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివం దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ



# సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో 'రోమాంచకం'.. ఆసక్తికరంగా ఫస్ట్ గ్లింప్స్

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఇండియన్ సినిమాను షేక్ చేసిన స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ఒక సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ రాబోతుంది. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'రోమాంచకం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'మేమ్ ఫేమస్' చిత్రంతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో సముద్ర తీరం బ్యాక్‌డ్రాప్‌లో హీరో హీరోయిన్ల మధ్య సాగే బైక్ రైడ్స్, రొమాంటిక్ సీన్స్ ఎంతో ఆహ్లాదకరంగా సాగగా.. అంతా ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో గ్లింప్స్ ముగింపులో దర్శకుడు ఒక ఊహించని మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇచ్చారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా చెంపదెబ్బలు కొట్టుకుంటూ 'ఐ హేట్ యూ' అని అరుచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతవరకు కూల్‌గా సాగిన వాతావరణం, ఒక్కసారిగా ఇంటెన్స్ ఎమోషనల్‌గా మారిపోవడంతో ఈ ప్రేమకథలో సందీప్ రెడ్డి వంగా మార్క్ గట్టిగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

# జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్.. రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'జైలర్' తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'జైలర్ 2' థియేట్రికల్ బిజినెస్ ఊహించిన దానికంటే పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఉండటంతో పంపిణీ హక్కుల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ బిజినెస్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఇది ముందే ఊహించా.. ఓటీటీ నుంచి 'సత్లుజ్' బ్యాన్‌పై నటుడు దిల్జీత్ దోసాంజ్ కామెంట్స్



ప్రముఖ నటుడు, సింగర్ దిల్జీత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఎలాంటి సెన్సార్ కోతలు లేకుండా జూలై 3న ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5లో గుట్టుచప్పుడు కాకుండా విడుదలైన ఈ చిత్రం, కేవలం రెండు రోజులకే ప్లాట్‌ఫామ్ నుండి అకస్మాత్తుగా తొలగించబడింది. ఈ వివాదాస్పద పరిణామంపై దిల్జీత్ దోసాంజ్ ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో స్పందిస్తూ, ఈ నిషేధం ఎప్పుడో ఒకప్పుడు జరగాల్సిందేనని, తాను దీన్ని ముందే ఊహించానని పేర్కొన్నారు. అయితే సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు తెరిచిన తర్వాత ఈ నిర్ణయం ఉంటుందని భావించానని, కానీ ఆదివారం సాయంత్రమే తీసేస్తారని అనుకోలేదని ఆయన అన్నారు. తాము ఈ సినిమాను కనీసం ప్రమోట్ కూడా చేయకుండా అలాగే విడుదల చేశామని, ఒకవేళ ప్రమోట్ చేసి ఉంటే ఇది రెండు రోజులు కూడా ఓటీటీలో ఉండేది కాదని దిల్జీత్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ తాము ఏం చెప్పాలనుకున్నామో, ఏ విధంగా చెప్పాలనుకున్నామో అది ప్రేక్షకులకు చేరినందుకు తనకు సంతోషంగా ఉందని, ఇది ప్రేక్షకుల సినిమా కాబట్టి ఎలా వీలైతే అలా డౌన్‌లోడ్ చేసుకుని అయినా చూడవచ్చని ఆయన చెప్పుకొచ్చారు. హనీ ట్రెహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా రూపొందింది. ఆయన 1995లో అపహరణకు గురై, ఆ తర్వాత కనిపించకుండా పోయారు. మొదట 'పంజాబ్ 95' అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమా గత మూడేళ్లుగా సెన్సార్ క్లియరెన్స్ కోసం నిలిచిపోయింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఏకంగా 127 కట్స్ ప్రతిపాదించడంతో, ఆ కోతలతో సినిమాను విడుదల చేయడానికి నిరాకరించిన దర్శకుడు, హీరో నేరుగా ఓటీటీ బాట పట్టారు. భారత్‌లో ఓటీటీ కంటెంట్‌పై థియేట్రికల్ సెన్సార్ పరిమితులు నేరుగా వర్తించకపోవడంతో, మేకర్స్ దీనిని 'సత్లుజ్' అనే కొత్త పేరుతో అన్‌కట్‌గా జీ5లో రిలీజ్ చేశారు. అయితే సెక్యూరిటీ కారణాలు, ఐటీ రూల్స్ ఉల్లంఘనలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జీ5 ఈ చిత్రాన్ని భారత్‌లో నిలిపివేసింది. ప్రస్తుతం ఈ చిత్రం భారతదేశం వెలుపల ఉన్న జెడ్5 గ్లోబల్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.





# నాగార్జున సినిమాలో విలన్‌గా అందాల భామ

టాలీవుడ్‌లో మన్మథుడు అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు కింగ్ నాగార్జున. మొన్నటి వరకు కుర్ర హీరోలు సైతం అసూయ పడేలా ఆన్‌స్క్రీన్‌పై రొమాన్స్ పండించాడు. అయితే ఈ మధ్య ఆయన తన పంథాను మార్చాడు. యాక్షన్ సినిమాలపై ఫోకస్ పెట్టాడు. తన 100వ సినిమా సినిమా పూర్తిగా యాక్షన్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ఉండేలా ప్లాన్ చేసుకున్నాడు.తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ కూడా పూర్తయింది. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఈ చిత్రంలో టబు నటిస్తున్నట్లు అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచి మరింత అంచనాలు పెరిగాయి. గతంలో వీరిద్దరు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' లాంటి సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. వీరిద్దరి ఆన్‌స్క్రీన్ రొమాన్స్‌కి ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా ఉంది. 100వ సినిమాలోనూ వీరిద్దరి మధ్య రొమాంటిక్ సీన్స్ ఉంటాయని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే లేటెస్ట్ సమాచారం ఏంటంటే.. ఈ చిత్రంలో నాగార్జునతో టబు ఫైట్ చేయబోతుంది. ఆమె హీరోయిన్‌గా కాకుండా, నెగటివ్ షేడ్స్ ఉన్న అత్యంత పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారట. నాగార్జున, టబుల మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలవనున్నాయని నెట్టింట ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,